31 . 01. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శనివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 237 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ఎడ్ సెట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జనవరి30( వెలుతురు):**
టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రసారం చేసే ఎడ్ సెట్ ప్రసారాల షెడ్యూల్ పోస్టర్ ను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. సచివాలయంలోని తన ఛాంబర్ లో టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తో కలిసి ప్రసారాల వివరాలు తెలిపే షెడ్యూల్ పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఎడ్ సెట్

## వెదురు కర్రలే దైవాలుగా... గద్దెలే గర్భగుడులుగా..

- కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న జాతర
- మేడారం మహా జాతరకు ప్రముఖుల రాక
- గవర్నర్, డిజిపి, మంత్రుల దర్శనాలు



**మేడారం,జనవరి 30( వెలుతురు):**
వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు,కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్కరైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక



## హార్వర్డ్ వర్సిటీలో సిఎం రేవంత్ శిక్షణ

- వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి

**హైదరాబాద్,జనవరి 30 వెలుతురు:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్



## మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

- రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి,ప్రధాని
- మహాత్ముడికి నివాళి అర్పించిన చంద్రబాబు



**న్యూఢిల్లీ,జనవరి30 వెలుతురు:**
మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ



కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక



## కెసిఆర్‌కు సిట్ షాక్

- మరోమారు నోటీసులు జారీ
- ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ
- నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి
- ఆదివారం 3గంటలకు విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీస్
- న్యాయనిపుణులతో చర్చించి నోటీసులు ఇచ్చిన సిట్

**హైదరాబాద్,జనవరి30 వెలుతురు:**
ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శు

## తెలంగాణ రైజింగ్ 2047
# లక్ష్యాల సాధనకు కృషి

### అన్ని శాఖలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి
### వ్యవసాయ, మత్స్య, కార్మిక శాఖలతో సిఎస్ సమీక్ష



**హైదరాబాద్,జనవరి 30( వెలుతురు):**
తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్దేశం చేసేందుకు గత మూడు రోజులుగా విభాగాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఈ రోజు వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఆహార, పౌర సరఫరాల, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, జి.ఎ.డి సర్వీసెస్ శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని అదే విధంగా భవిష్యత్ లో యూరియా, ఎరువుల పంపిణీని ఐటి ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ శాఖలలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ఎ÷-లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్ లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. అదే విధంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ శాఖ నిరంతర

## జలశక్తి కమిటీ ముందు ముగిసిన భేటీ

- పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును తొలగించాలి
- కమిటీ ముందు తెలంగాణ డిమాండ్



**న్యూఢిల్లీ,జనవరి30 వెలుతురు:**
కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు ఈ భేటీ జరిగింది. అజెండాలో 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టవద్దని కోరింది. ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50 శాతం వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఏపీ

## తెలంగాణ ప్రాజెక్టులకు పాతర

- చంద్రబాబుతో దోస్తీతో ఎపికి లైన్ క్లీయర్
- నల్లమల సాగర్ ప్రాజెక్ట్ కోసం నాటకాలుడుతన్న రేవంత్
- ఇరిగేషన్ మీటింగ్ బాయ్‌కాట్ చేయడం ఒక్కటే మేలు
- రేవంత్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్న హరీష్ రావు



**హైదరాబాద్,జనవరి 30 వెలుతురు:**
ఏపీ సీఎం చంద్రబాబుతో సీఎం రేవంత్‌రెడ్డి దోస్తీ కట్టి తెలంగాణకు అన్యాయం చేస్తున్నడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. చంద్రబాబుతో దోస్తీ కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి హరీష్‌రావు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కేంద్రానికి 10 డీపీఆర్‌లు పంపి ఏడు ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ఒక్క అనుమతి కూడా తేలేదని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లేందుకు ఆదిత్యనాథ్ మినహా తెలంగాణ సోయి కలిగిన ఒక్క ఇంజినీర్ దొరకలేదా..?' అని హరీష్‌రావు ప్రశ్నించారు. మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది. తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజినీర్ దొరకలేదా..? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోనుపోను అంటూనే మీటింగ్‌లకు అటెండ్ కావడం

## తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

- పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై చర్చే లేదు
- హరీష్ రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి
- పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్,జనవరి 30 వెలుతురు:**
కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన...

## 4 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి

- 80శాతం స్థానికులకే ఉద్యోగాలు
- జేఎన్‌టీయూలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి



**కాకినాడ,జనవరి30 వెలుతురు:**
4 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని.. అందులో 80 శాతం స్థానికులకే ఇస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి, మందులు అందుబాటులో తెచ్చామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని, త్వరలో పరిష్కారం చేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కాకినాడలో పర్యటించిన

## దానం అనర్హతపై స్పీకర్ విచారణ

- కౌశిక్ రెడ్డి పిటిషన్ ఆధారంగా క్రాస్ ఎగ్జామిన్
- సమయం కోరిన బిజెపి నేత మహేశ్వరెడ్డి
- 18న విచారణకు హాజరు కావాలని గడువు



**హైదరాబాద్,జనవరి30 వెలుతురు:**
పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. దానంపై అనర్హత వేటు వేయాలని పాడి కౌశిక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారు. ముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. దానం తరఫున



## ఐపిఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

- క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్
- బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి30 వెలుతురు:**
తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే

## ప్రశంసలు కాదు..పనిపై శ్రద్ధ పెట్టండి

### ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాల్సిందే
### ఉత్తరాంధ్ర పంచాయితీ అధికారులతో డిప్యూటి సిఎం పవన్


**అమరావతి,జనవరి 30 వెలుతురు:**



తనకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదని, క్షేత్రస్థాయిలో నిజమైన పని మాత్రమే కావాలని ఏపీ డిప్యూటీ

## కర్మయోగి పోర్టల్‌లో ఎపి రికార్డు

- ఆనందం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు



**అమరావతి,జనవరి30 వెలుతురు:**
కర్మయోగి పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త జాతీయ రికార్డు సృష్టించింది. దేశంలో కోటి కోర్సుల దరఖాస్తులను పూర్తిచేసిన తొలి రాష్ట్రంగా నిలిచింది. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఈ విజయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంచుకున్నారు. ఈ పోర్టల్‌లో కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు, 80

# తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల సాధనకు కృషి

మానిటరింగ్ చేయాలని డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిగతులు, రైతులకు అందుతున్న సేవలు, సాగునీటి లభ్యత, విత్తనాలు?ఎరువుల సరఫరా, పంటల దిగుబడి, అలాగే సహకార శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రాబోయే సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సహకార సంఘాల పనితీరు, రైతు సహకార సంఘాల ఆర్థిక స్థితి, రుణాల పంపిణీ పై సమీక్ష చేశారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పారదర్శకతతో కూడిన వ్యవస్థను అమలు చేయాలని, రైతుల విశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, సమస్యలు ఎదురైన చోట వెంటనే పరిష్కరించాలని సి.ఎస్ స్పష్టం చేశారు.పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖ : అనంతరం పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖలపై సి.ఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పశుసంవర్ధక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, డెయిరీ రంగంలో ఉత్పత్తి పెంపు, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంపై చేపట్టిన కార్యక్రమాలు, మత్స్యశాఖ ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల పురోగతిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. శువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పశువుల వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. డెయిరీ అభివృద్ధి అంశంలో పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాల సామర్థ్యాన్ని పెంచాలని, చిన్న, సన్నకారు పాడి రైతులకు లాభదాయకంగా ఉండే విధంగా విధానాలు రూపొందించాలని పేర్కొన్నారు. సహకార డెయిరీ సంస్థల పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మత్స్యశాఖ సమీక్షలో, చేపల ఉత్పత్తి పెంపు, చెరువులు, కుంటలు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, మిడ్ మానేరు, పాలేరు తదితర జలాశయాల్లో చేపల పెంపకం పై కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. మత్స్యకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మత్స్యకారుల సంక్షేమ పథకాలు సమయానికి లబ్ధిదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అలసత్వం వహించకూడదని సి.ఎస్ స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని సూచించారు. పర్యావరణం, అటవీ, కాలుష్య నియంత్రణ మండలి : ఈ సమావేశంలో శాఖల వారీగా అమలు చేస్తున్న పథకాలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సి.ఎస్ సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావం తగ్గింపు దిశగా చేపడుతున్న చర్యలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. అటవీ శాఖ పరిధిలో అటవీ సంరక్షణ, అటవీ ఆధారిత జీవనోపాధి కార్యక్రమాలు, అటవీ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ-గవర్నెన్స్, తెలంగాణ విజన్ 2047, పర్యావరణ అనుమతులు, ప్రాజెక్టుల వేగవంతం, శాఖల మధ్య సమన్వయం పెంచుకుని ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత కాలంలో సాధించాలని తెలిపారు. కవ్వాల్, అమ్రాబాద్, టైగర్ రిజ్వర్వ్ ప్రాంతాల సమస్యలపై సమీక్షించారు. కంపా నిధుల వినియోగం, హరిత నిధి, ఎకో టూరిజం, గ్రీన్ కవర్, ట్రెక్ పార్క్ లో, అర్బన్ పార్కులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. పౌర సరఫరాల శాఖ :పౌర సరఫరాల శాఖపై సి.ఎస్ సమీక్షిస్తూ శాఖ పరిధిలో అమలవుతున్న వివిధ పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలు, సరఫరా వ్యవస్థ పనితీరు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా ప్రజా పంపిణీ వ్యవస్థ, లబ్ధిదారులకు సన్న బియ్యం, గోదాముల్లో నిల్వలు, రేషన్ దుకాణాల పనితీరు, ఈ?పాస్ యంత్రాల వినియోగం, ఆహార భద్రత చట్టం అమలు, రేషన్ కార్డుల జారీ అంశాలపై సమీక్షించారు.

కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల పురోగతి, కార్మికుల సంక్షేమం సంబంధించిన పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ఉపాధి కల్పన లక్ష్యంగా చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉండాలని, యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటిసి, ÷ుక్షఓఅక్షఓ, ఐటీఐలు, కృషి విజ్ఞాన కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచాలని, ప్రైవేట్ రంగంతో సమన్వయం పెంచాలని అన్నారు. యువతకు స్కిల్స్ అప్ గ్రేడింగ్ కార్యక్రమాలు నిర్వహించి విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని,నర్సింగ్ కోర్సుల ద్వారా యువతకు విదేశాలలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రణాళికను సిద్ధం చేయాలని సి.ఎస్ సూచించారు. తదుపరి సాధారణ పరిపాలన శాఖ పై సమీక్ష నిర్వహించారు. రాజ్యాంగ బద్ధమైన సంస్థల స్థితిగతులు, పెండింగ్ డిసిప్లినరీ కేసులు, కార్యాలయాల లభ్యత, జనగణన, పెండింగ్ ఆడిట్ వివరాలు, పరిపాలన సంబంధమైన అనేక విషయాలపై సమీక్షించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దాన కిషోర్, బిఎండి ఎక్కా, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ సువర్ణ, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మత్స్యశాఖ కమిషనర్ నిఖిల, హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి, ఇ.శ్రీధర్, డైరెక్టర్ సెన్సెస్ భారతీ హోళికేరి, ఐటి శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# వెదురు కర్రలే దైవాలుగా... గద్దెలే గర్భగుడులుగా..

మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత మన దేవత జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క?సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు .ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.

## ఎడ్ సెట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్రీధర్ బాబు

లో ఉన్నతమైన ర్యాంకులు సాధించేందుకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా బీఈడీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రధాన్యత నిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టి-సాట్ కంటెంట్ సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫాం ద్వార అందుబాటులో ఉంటుందని, తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. తెలంగాణా ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, మే నెలలో జరిగే ఎడ్ సెట్ పరీక్ష కోసం అభ్యర్థులను సిద్ధం చేసేందుకు పిబ్రవరి రెండవ తేది నుండి మే 11వ తేది వరకూ రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. .బయాలజీ, పిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు స్జబెక్టులతో 98 రోజుల పాటు టి-సాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యబ్ లో ప్రసారాలు కొనసాగుతాయి. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందించేందుకు కృషి చేస్తున్న సీఈవో వేణుగోపాల్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ పాల్గొన్నారు.

# కర్మయోగి పోర్టల్‌లో ఎపి రికార్డు

లక్షలకు పైగా కోర్సులు పూర్తయ్యాయని.. 4,290 కోర్సుల ద్వారా ఇది సాధ్యమైందని సీఎం పేర్కొన్నారు. ’ కర్మయోగి పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇందులో కోటికి పైగా దరఖాస్తులు వచ్చాయి. 80 లక్షలకు పైగా కోర్సులకు శిక్షణ పూర్తైంది. మొత్తం 4,290 కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యాభివృద్ధి పొందారు. ఇది ప్రభుత్వ ఉద్యోగుల నిరంతర అభ్యాసం పట్ల బలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ఎ÷-లానింగ్ సొసైటీ(ఙఖాఆఖా) ఆధ్వర్యంలో సమర్థవంతంగా ఈ కర్మయోగి కార్యక్రమం అమలవుతోంది. నైపుణ్యంతో కూడిన భవిష్యత్తు వైపు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది’ అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. తిఉక్షి కర్మయోగి పోర్టల్.. భారత ప్రభుత్వం చేపట్టిన మిషన్ కర్మయోగి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఒక డిజిటల్ లెర్నింగ్ ఎ÷-లాట్‌ఫామ్. దీనిని ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం, ఇతర అధికారుల కోసం రూపొందించారు. ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడం, నైపుణ్యాలు అభివృద్ధి చేయడం, భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయడం ఈ పోర్టల్ ప్రధాన లక్ష్యం.

# కెసిఆర్‌కు సిట్ షాక్

క్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న( గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్ కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్ లోని నందినగర్ లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ లోనే ఎలాంటి నోటీసులైనా..ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ అడ్రస్ కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

## 4 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి

జేఎన్‌టీయూలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్ర చేసిన తర్వాత చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. ప్రతి నెలా విద్యార్థులతో మాట్లాడతానని.. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి నెలా నిర్వహిస్తామని తెలిపారు. తాను చిన్నప్పుడు బట్టీ పట్టి చదవలేదని, పాఠం మొత్తం విని నేర్చుకునేవాడినని గుర్తుచేశారు. కుంభమేళా కార్యక్రమం చూసి క్రౌడ్ మేనేజ్‌మెంట్ నేర్చుకున్నానని తెలిపారు. ’డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మొదటిసారి హైదరాబాద్‌లో చంద్రబాబు ఇంటికి భోజనానికి పిలిచినప్పుడు చూశాను. ఆ తర్వాత రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో మా కుటుంబానికి అండగా నిలబడ్డారు. కష్టకాలంలో తోడుగా వచ్చిన వారిని ఎప్పుడూ మరచిపోకూడదు. మీరు కూడా ఈ విషయం గుర్తుంచుకోవాలి’ అని విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ సూచించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో కొంతమంది గొడవలు పెడుతున్నారని, ఏ కుటుంబంలో పుడతామో ఎవరి చేతుల్లోనూ ఉండదని చెప్పారు. కెమికల్ ఇంజనీరింగ్ మంచి కోర్సు అని, భవిష్యత్తులో అనకాపల్లిలో కెమికల్ ఫార్మా కంపెనీలు పెడతామని లోకేశ్ తెలిపారు. త్వరలో రాష్ట్రానికి 760 కంపెనీలు తీసుకొస్తున్నామని, అగ్రికల్చర్ ఎంత ముఖ్యమో.. పరిశ్రమలు కూడా అంతే ముఖ్యమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దావోస్ వెళ్లి వచ్చిన తర్వాత విశాఖపట్నంలో చాలా కంపెనీలకు శంకుస్థాపన చేశామని చెప్పారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ’మీరెప్పుడైనా క్లాస్‌లకు బంక్ కొట్టారా?’ అని విద్యార్థులు అడగగా, లోకేశ్ నవ్వుతూ ’తాను ఎప్పుడు బంక్ కొట్టలేదు’ అని సమాధానమిచ్చారు. తాను ఎంబీఏ చదువుతున్న సమయంలో 90శాతం అటెండెన్స్ ఉందని, తన భార్య బ్రాహ్మణికి 100 శాతం అటెండెన్స్ ఉందని ఆయన చెప్పారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా సంభాషించిన లోకేశ్.. వారి సందేహాలను నివృత్తి చేశారు.

## తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించా మన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ‘ఒక్క చుక్క నీరు కూడా వదులుకోం. ఢిల్లీలో జరిగిన మీటింగ్ గురించి హరీష్ రావు తెలుసుకుని మాట్లాడాలి.. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధం.. కానీ చుక్క నీరు కూడా వదులుకునేది లేదు.. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారు.. ఇంటర్ స్టేట్ ఇష్యూలు అజెండాలో పెట్టాలని కేంద్రానికి చెప్పారు. పోలవరం.. నల్లమల సాగర్ కి అనుమతి లేదని కేంద్ర మంత్రి నాకు లేఖ రాశారు.. ఇవాళ జరిగిన మీటింగ్ లో కూడా సీడబ్ల్యూసీ ఇదే చెప్పింది.. పదేళ్ల రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కట్టిన ప్రాజెక్టు కూలింది.. ఆ నాయకులు సిగ్గుపడాలి.. పదేళ్లలో ఎస్ఎల్‌బిసి పూర్తి చేయలేదు.. డిండి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. పదే పదే అబద్దాలు చెప్పి? నిజం చేయాలని అనుకుంటున్నారు.. పదేళ్ల లో కంటే ఈ రెండేళ్లలో ఎక్కువ నీటి వినియోగం, వరి దిగుబడి వచ్చిందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

# ప్రశంసలు కాదు..పనిపై శ్రద్ధ పెట్టండి

సీఎం పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు పూర్తి నిబద్ధతతో పని చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.. ఉత్తరాంధ్ర పంచాయతీరాజ్ అధికారుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఘాటు వ్యాఖ్యలు చేశారు. అధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ వంటి కీలక పథకాల అమలులో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోయినా, పనిలో అలసత్వం చూపించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సోషల్ ఆడిట్ ప్రక్రియను కూడా మొక్కుబడిగా కాకుండా పక్కాగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేరాల్సిందేనని, అలా జరగకపోతే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.. ఇక, తన వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు, సిఫార్సులు ఉండవని పవన్ కల్యాణ్ స్పష్టంగా చెప్పారు. ప్రతి అధికారి నిబంధనల ప్రకారమే పని చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పని చేసిన కొంతమంది అధికారులు ఇప్పటికీ పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తూ ప్రభుత్వ విధానాల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వ్యవహారాలను ఇకపై సహించబోమని హెచ్చరించారు. ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు తావులేకుండా నిబంధనల మేరకు మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనిలో అలసత్వాన్ని అస్సలు సహించబోమని మరోసారి స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా పూర్తి చేశామని పవన్ కల్యాణ్ తెలిపారు. ఒకేసారి దాదాపు 10 వేల మందికి ప్రమోషన్లు కల్పించడం ద్వారా ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకున్నామన్నారు. అధికారులు పొందిన ఈ సంతోషం ప్రజల్లోనూ కనిపించాలన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ఎంపీడీవోపై దాడి ఘటన చోటుచేసుకున్నప్పుడు స్వయంగా అక్కడికి వెళ్లి భరోసా ఇచ్చామని గుర్తు చేశారు. అధికారులు కష్టాల్లో ఉంటే ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కష్టపడుతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల మద్దతు కూడగట్టి నిధులు సాధిస్తున్నామని చెప్పారు. ఆ కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు సమర్థంగా పని చేయాలని కోరారు. ప్రజల సంక్షేమం, సంతోషమే లక్ష్యంగా పని చేయాలని, కూటమి ప్రభుత్వ సంకల్పానికి అధికారులు పూర్తి స్థాయిలో తోడుగా నిలవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు పాతర

ఏమిటి..? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమే మీ చర్చల లక్ష్యమా..?’ అని ప్రశ్నించారు. సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. ఇవాళ్టి ఇరిగేషన్ మీటింగ్ ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తెలంగాణకు మరణశాసనం రాయబోతున్నదని చెప్పారు. పోలవరం నల్లమలసాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరును ఒకసారి గమనించండి. పోను పోను అనుకుంటూనే ÷ళివంత్ రెడ్డి నాడు ఢిల్లీ మీటింగ్‌కు వెళ్ళాడు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపాడు. పెట్టబోను అంటూనే సంతకంపెట్టి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాశాడు. వేయను అంటూనే కమిటీవేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీంకోర్టుకు వెళ్ళి నల్లమలసాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పసలేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమలసాగర్‌కు మద్దతు ప్రకటించాడు’ అని రేవంత్ కుట్రలను వెల్లడించాడు. చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నడు. ఏపీ ఒత్తిడితో ఇవాళ జరుగుతున్న ఢిల్లీ మీటింగ్‌లో ఇంజనీర్లు పాల్గొంటున్నారు. ఇది పేరుకు జలవివాదాల మీటింగ్ కానీ, మన 200 టీఎంసీల నీటిని గంపగుత్తగా తరలించుకుపోయే నల్లమలసాగర్ అనే ప్రాజెక్టుకు సంబంధించిన కుట్ర. ఇలాగే గతంలో కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశంలో ఏపీ ఈ ప్రాజెక్టునే ఏకైక ఎజెండాగా ముందుపెట్టింది. ఇప్పుడు కూడా ఏపీ పాలకులు నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టునే తెరమీదకు తెచ్చి చర్చ చేస్తున్నరు’ అని హరీష్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో గోదావరిలో 400 టీఎంసీలకు కేంద్రం నుంచి అనుమతులు తెచ్చారు. గోదావరి మీద 10 డీపీఆర్‌లు పంపి.. 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు. రెండేళ్లలో ఒక్క డీపీఆర్ పంపింది లేదు. ఒక్క అనుమతి తెచ్చింది లేదు. వార్ధా, కాళేశ్వరం మూడు టీఎంసీలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డీపీఆర్‌లు వాపస్ చేసింది. రేవంత్‌రెడ్డి పాలనలో డీపీఆర్‌లు వాపస్ వచ్చిన పరిస్థితి. నువ్వు మన డీపీఆర్‌లు వాపస్ తెచ్చుకుంటవు, నల్లమలసాగర్‌కు జెండా ఊపుతవు. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డీ నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు’ అని హరీష్‌రావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నీటిని ఒడిసిపట్టింద్రని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి విడిచిపెట్టిండని హరీష్‌రావు మండిపడ్డారు. ఏపీ పాలకులతో కలిసి తెలంగాణకు జలద్రోహం చేస్తున్నడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు.

కేసీఆర్ పాలన గురించి ఎకనామిక్ సర్వే రిపోర్టే స్పష్టం చేసింది. తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. రెండు కోట్ల 20 లక్షల ఎకరాలు మాగాణిగా మారింది. కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చింది. కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైంది. 32 లక్షల ఎకరాల ఆయకట్టు బీఆర్ఎస్ సాధించింది’ అని మాజీ మంత్రి చెప్పారు. ’బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు పారేసుకోవడం మానుకుంటే మంచిది. కేంద్రంలోని మీ ప్రభుత్వమే తెలంగాణ ప్రగతిపథాన్ని వివరిచింది. కళ్లు తెరవండి అనవసరంగా బీఆర్ఎస్ మీద నోళ్లు పారేసుకోకండి’ అని హరీష్‌రావు బీజేపీ నేతలకు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఢిల్లీ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేశారు. పాలకులకు ఢిల్లీకి, దావోస్‌కు తిరగడమే తప్ప పాలన మీద దృష్టి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ సేద్యంపై దృష్టిసారిస్తే, రేవంత్ చోద్యం చూస్తున్నడని ఆరోపించారు.

## హార్వర్డ్ వర్సిటీలో సిఎం రేవంత్ శిక్షణ




గవర్నమెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62 మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారు. అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్కలతో కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

## జలశక్తి కమిటీ ముందు ముగిసిన భేటీ

ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ తెలిపారు. అజెండా అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని ఖరారు చేస్తామని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నదీ జలాల నిర్వహణ, వినియోగం విషయంలో కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైంది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. కమిటీ తదుపరి చర్చల కోసం జల వివాదాలకు సంబంధించిన అజెండా అందజేయాలని కమిటీ సభ్యులను సీడబ్ల్యూసీ ఛైర్మన్ కోరారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ సలహాదారులు, ఇంజనీర్ ఇన్- చీఫ్‌లు, జలవనరుల శాఖ అధికారులు, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ ఛైర్మన్లు, ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ నుంచి జలవనరుల శాఖ అడ్వైజర్- వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి పలువురు అధికారులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ నుంచి ఆదిత్యనాథ్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు.

# సుల్తానాబాద్ మున్సిపాలిటీలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పర్యటన



**సుల్తానాబాద్ వెలుతురు జనవరి 30:**
పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపాలిటీలో బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పర్యటించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి నెలలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలతో ఆయన విస్తృతంగా చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని ఇంటింటి ప్రచారం, బూత్ స్థాయి కమిటీల బలోపేతం, కార్యకర్తల సమన్వయంతో విజయానికి బీజేపీ కృషి చేయాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలపై బీజేపీ స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ బిజెపి పార్టీ టౌన్ అధ్యక్షులు కూకట్ల నాగరాజు రూరల్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సౌదరి మహేందర్ యాదవ్ కార్యకర్తలు నేతలు పాల్గొన్నారు

# దానం అనర్హతపై స్పీకర్ విచారణ

న్యాయవాదులు కౌశిక్ రెడ్డిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. దానంపై పిటిషన్ ఎందుకు వేశారు?.. పార్టీ మారారని చెప్పేందుకు గల ఆధారాలపై పాడి కౌశిక్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ నుంచి దానం పోటీ చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందడం, ఆ తరువాత కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయడం, దానం ప్రచార ఫొటోలు, వీడియోలు.. దానం కాంగ్రెస్ కండువా వేసుకున్న ఫొటోలను స్పీకర్ ముందు ఉంచారు పాడి కౌశిక్ రెడ్డి. దీంతో స్పీకర్ ఎదుట పాడి కౌశిక్ రెడ్డి విచారణ ముగిసింది. ఇక, దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై సాక్ష్యాలను అఫిడవిట్ రూపంలో దాఖలు చేశారు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి. మహేశ్వర్ రెడ్డి తరఫు న్యాయవాదులు.. స్పీకర్ ముందు హాజరయ్యారు. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు ఎవిడెన్స్ అఫిడవిట్‌ను పొందుపరిచానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాను వ్యక్తిగతంగా హాజరుకాలేనని ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కావాలంటే సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 20 తరువాత సమయం ఇస్తే తాను విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతానని అఫిడవిట్‌లో మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో బీజేపీ పిటిషన్‌పై ఫిబ్రవరి 18న స్పీకర్ విచారించనున్నారు. ఇక, పార్టీ ఫిరాయింపుల కేసు కీలక దశకు చేరుకుంది. ఇప్పటివరకూ పది మంది ఎమ్మెల్యేలపై ఆరోపణలు రాగా.. ఎనిమిది మందికి సంబంధించిన విచారణ పూర్తి అయ్యింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణ జరగాల్సి ఉండగా... దానంను స్పీకర్ విచారించారు. దానం చెప్పే విషయాలను స్పీకర్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ సమయంలోనూ ఇదే జరిగింది. విచారణ సమయంలో ఏ పార్టీలో ఉన్నారనే విషయాన్ని ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను స్పీకర్ ప్రశ్నించగా.. వారంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఇక దానం నాగేందర్ కూడా మొన్నటి వరకు తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అవసరమైతే ఉపఎన్నికకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే గత రెండ్రోజులుగా దానం యూటర్న్ తీసుకున్న పరిస్థితి. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, పార్టీకి ఇంకా రాజీనామా చేయలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ తనపై అనర్హత వేటు వేస్తే.. ఉప ఎన్నికకు సిద్ధమని దానం పదేపదే చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# ఐపిఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు. గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు. తన క్షమాపణల అనంతరం ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించాలని కౌశిక్ రెడ్డి కోరారు. అయితే ఐపీఎస్ అధికారిపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ పేర్కొంది. మతం పేరుతో ఆరోపణలు చేయడం దారుణమని చెప్పుకొచ్చింది. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న అధికారిపై వ్యక్తిగత దాడి చేశారని అసోసియేషన్ మండిపడింది. మత మార్పిడుల ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ ఘటన సివిల్ సర్వీస్ అధికారుల మనోబలాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపింది. ఎమ్మెల్యే ప్రవర్తనపై తక్షణ విచారణకు డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే నుంచి బహిరంగ క్షమాపణ కోరింది. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి మతమార్పిడికి ప్రయత్నిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అతని మతం గురించి చేసిన ఆరోపణలతో తీవ్రంగా కలత చెందుతున్నామని పేర్కొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి క్షమాపణలు తెలిపారు.

# తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదల

**హైదరాబాద్,జనవరి 30( వెలుతురు):**
తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదలైంది. టెట్ 2026 జనవరి కీ, రెస్పాన్స్ షీట్‌లను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ నెల 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. టెట్ 'కీ'పై అభ్యంతరాలను నేటి నుంచి ఫిబ్రవరి 1న సాయంత్రం 5గంటల వరకు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. తెలంగాణ టెట్ పేపర్ 1, పేపర్ 2కు కలిపి దాదాపు 2.37లక్షల దరఖాస్తులు రాగా.. వీటిలో 71,670మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉన్నారు. మరిన్ని వివరాలను టెట్ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపింది.

# భారత్ - ఈయూ ఎఫ్‌టీఏ.. మన భవితకు దిక్సూచి



**- పీయూష్ గోయల్**
(రచయిత కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్థిక దౌత్యంలో భారత్ - ఐరోపా యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఓ చరిత్రాత్మక మైలురాయి. ఇది లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తుంది. భారతీయ యువతకు, రైతులకు అపారమైన అవకాశాలను అందిస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో వంతయిన దాదాపు 200 కోట్ల మంది ప్రజలకు సంపదను చేకూరుస్తుంది.
ప్రపంచంలో రెండో, నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య కుదిరిన ఈ ఒప్పందం.. చరిత్రలో అతిపెద్ద వాణిజ్య ఒప్పందాల్లో ఒకటి. నిజానికి ఇది కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు.. కృత్రిమ మేధ, రక్షణ, సెమీకండక్టర్ల వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంపొందించే సమగ్ర భాగస్వామ్యమిది. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశంలోని ప్రతి ప్రాంతానికీ, ప్రతి పౌరుడికీ.. ముఖ్యంగా పేద వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది.




ఈ ఒప్పందం నిబంధనల ఆధారిత వాణిజ్యాన్ని, ఆర్థిక విధానాల్లో స్థిరత్వాన్ని అందిస్తుంది. దీంతో దేశీయ, విదేశీ పెట్టుబడులకు మరింత ఆకర్షణీయ స్థానంగా భారత్ నిలుస్తుంది. ఇది చిన్న వ్యాపార సంస్థలు, అంకుర సంస్థలు, కార్మికులకు అపారమైన అవకాశాలను అందిస్తుంది.
'ఇది అన్ని ఒప్పందాలకూ తల్లి' వంటిదంటూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రధానమంత్రి మోదీ ప్రకటనకు ప్రశంసలు లభించాయి. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న ఈ సమయంలో ఈ ఒప్పందం స్థిరత్వాన్ని మరింత బలోపేతం చేస్తుంది. బహిరంగ మార్కెట్లు, పారదర్శక విధానాలు, సమ్మిళిత వృద్ధికి కట్టుబడిన విశ్వసనీయ భాగస్వాములుగా.. భారత్, ఐరోపా యూనియన్‌లను ఈ ఒప్పందం నిలుపుతుంది.




ఐరోపా యూనియన్‌కు భారత్ చేసే ఎగుమతుల్లో 99 శాతానికి పైగా వస్తువులకు.. వాణిజ్య విలువ పరంగా మునుపెన్నడూ లేని రీతిలో మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ఇది ఊతమిస్తుంది. ముఖ్యంగా కార్మికులు ఎక్కువగా ఉండే జౌళి, దుస్తులు, తోలు వస్తువులు, పాదరక్షలు, సముద్ర ఉత్పత్తులు, రత్నాలు – ఆభరణాలు, హస్తకళా ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, ఆటోమొబైల్స్ వంటి రంగాలకు ఈ ఒప్పందం తిరుగులేని బలాన్నిస్తుంది.
ఈ ఒప్పందం దాదాపు 33 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ ఎగుమతులపై 10 శాతం వరకు సుంకాలను తొలగిస్తుంది. అలాగే వాణిజ్య కార్యకలాపాల్లో అన్ని దశల్లోనూ భారతీయ వ్యాపారాలను అంతర్జాతీయ స్థాయిలో అనుసంధానిస్తూ.. కార్మికులు, కళాకారులు, మహిళలు, యువత, ఎంఎస్ఎంఈలకు సాధికారతను చేకూరుస్తుంది. అంతర్జాతీయ వాణిజ్యంలో కీలక సరఫరాదారుగా భారత్ పాత్రను ఇది మరింత బలోపేతం చేస్తుంది.
దేశాల మధ్య వ్యాపారవేత్తలు, వృత్తి నిపుణుల రాకపోకలను ఈ ఒప్పందం సులభతరం చేస్తుంది. విద్య, సమాచార సాంకేతికత, ఆర్థిక సేవలు, కంప్యూటర్ రంగాల్లో కొత్త అవకాశాలను కల్పిస్తుంది. ఇది ఉన్నత స్థాయి ఉద్యోగావకాశాలను అందిస్తుంది. అలాగే ప్రతిభ, ఆవిష్కరణలు, సుస్థిర ఆర్థిక వృద్ధికి అంతర్జాతీయ కేంద్రంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.
పేదల జీవితాలను మెరుగుపరిచేందుకు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విస్తృత వ్యూహంలో ఈ వాణిజ్య ఒప్పందాలు ఒక భాగం. ముందుగా విప్లవాత్మక సంస్కరణలు, వివేకవంతమైన ఆర్థిక నిర్వహణ ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమూ.. ఆపై అభివృద్ధి చెందిన, మనకు అనుకూలమైన ఆర్థిక వ్యవస్థలతో ఇరుపక్షాలకు లాభదాయకమైన ఒప్పందం లక్ష్యంగా చర్చలు చేయడం ఈ వ్యూహం ముఖ్య లక్షణం.
ఇతర దేశాలతో పోలిస్తే భారత్ ఆధిక్యం ఉన్న అంశాల్లో మార్కెటును అందుబాటులోకి తెస్తూ.. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఈ విధానం వీలు కల్పిస్తుంది. వ్యవసాయం, పాడి పరిశ్రమ వంటి సున్నితమైన రంగాలను కాపాడుకుంటూ.. కార్మికులు ఎక్కువగా ఉండే రంగాలను అభివృద్ధి చేసుకునేందుకు ఇవి అత్యంత కీలకమైనవి.
అభివృద్ధి చెందిన దేశాలతో కుదుర్చుకునే వాణిజ్య ఒప్పందాలు భారతీయ పరిశ్రమల్లో ఆరోగ్యకరమైన పోటీని పెంపొందిస్తాయి. వినియోగదారులకు ప్రపంచ స్థాయి ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తాయి. భారత విపణిని విచక్షణారహితంగా బహిరంగం చేసిన యూపీఏ మాదిరి కాకుండా.. సుంకాల తగ్గింపును దశలవారీగా చేపట్టేలా ఈ ఒప్పందాలపై మోదీ ప్రభుత్వం చర్చించింది. తగిన విధానపరమైన చేయూతనిస్తూ... పోటీతత్వాన్నీ, నాణ్యతనూ మెరుగుపరచుకునేందుకు పరిశ్రమలకు ఇది తగినంత సమయాన్నిస్తుంది.
తక్కువ ధరల్లోనే అత్యుత్తమ ఉత్పత్తులను సరఫరా చేయడమన్నది ప్రధానమంత్రి వికసిత భారత్– 2047 లక్ష్యంలో ప్రధానమైన అంశం. "రండి, ఈ యేడు సర్వశక్తులూ ఒడ్డి నాణ్యతకే పెద్దపీట వేద్దాం. నాణ్యత, నాణ్యత.. నాణ్యత మాత్రమే!... ఇదే మనకు మంత్రప్రదం కావాలి. నిన్నటి కన్నా నేడు నాణ్యత మెరుగుపడాలి. మనం దేన్ని తయారు చేసినా, అందులో నాణ్యతను పెంచుదామని ప్రతినబూనుదాం" అంటూ ఈ నిబద్ధతనే ప్రధానమంత్రి గతవారం పునరుద్ఘాటించారు.
భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న ప్రధానమంత్రి మోదీ లక్ష్యానికి అనుగుణంగా ఈ భారత్ – ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రూపుదిద్దుకుంది. ఇది అంతర్జాతీయ వేదికపై భారత్‌ను ఒక క్రియాశీలక, విశ్వసనీయ, దూరదృష్టి కలిగిన భాగస్వామిగా నిలబెడుతుంది. అలాగే ఇరు ప్రాంతాల్లో సమ్మిళిత, దృఢమైన, భవిష్యత్ సన్నద్ధమైన వృద్ధికి పునాదులు వేస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలతోనే మోదీ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంది. జౌళి, పాదరక్షలు, రత్నాలు–ఆభరణాలు, హస్తకళల వంటి భారతదేశ ప్రధాన ఉపాధి కల్పన రంగాల్లో ఈ దేశాలు ప్రత్యక్షంగా పోటీ పడవు. గత యూపీఏ ప్రభుత్వ విధానాలు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉండేవి. అప్పట్లో మనతో పోటీ పడే ఆర్థిక వ్యవస్థలతో అత్యుత్సాహంతో ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల.. భారత్‌కు లభించిన ప్రయోజనాల కన్నా కోల్పోయిందే ఎక్కువ. అంతేకాకుండా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే ముందు యూపీఏ ప్రభుత్వం సంబంధిత వర్గాలతో అర్థవంతమైన చర్చలు జరిపిన దాఖలాలు లేవు. కానీ మోదీ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా.. ఆర్థికవేత్తలు, పారిశ్రామిక సంస్థలు, నిపుణులు, వివిధ ప్రభుత్వ విభాగాలతో సమగ్రమైన సంప్రదింపుల తర్వాతే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంది. దాంతో మోదీ ప్రభుత్వం కుదుర్చుకున్న ప్రతి ఒప్పందానికీ పరిశ్రమ వర్గాల నుంచి విస్తృత ప్రశంసలు లభించాయి. ఈ ఒప్పందాలు ఇరుపక్షాలకు కొత్త అవకాశాలను కల్పించడమే కాకుండా.. దేశంలో కార్మికులు ఎక్కువగా ఆధారపడి ఉన్న రంగాలకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలను విస్తరించాయి. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపే దిశగా మన ప్రస్థానాన్ని ఈ ఒప్పందాలు వేగవంతం చేశాయి.
యూపీఏ హయాంలో ఆర్థిక వృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, వ్యాపార రంగంలో నైరాశ్యం నెలకొనడంతో.. ఐరోపా యూనియన్ సహా అభివృద్ధి చెందిన దేశాలు భారత్‌పై ఆసక్తిని కోల్పోయాయి. దీంతో వృద్ధిని వేగవంతం చేయగల, విస్తృత ఉపాధి అవకాశాలను సృష్టించగల, ఇరుపక్షాలకూ లాభదాయకమైన వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే విలువైన అవకాశాలను భారత్ కోల్పోయింది.
భారత్ – ఐరోపా యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతోపాటు మోదీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఇతర వాణిజ్య ఒప్పందాలు.. అస్థిరతకూ, నిశ్చయాత్మక నాయకత్వానికీ నడుమ వ్యత్యాసాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. గత ప్రభుత్వాలు సంశయిస్తూ, ప్రయోజనాల విషయంలో రాజీ పడగా... మోదీ ప్రభుత్వం మాత్రం మార్కెట్లను విస్తరించే, ఉపాధిని సృష్టించే, దేశ కీలక ప్రయోజనాలను కాపాడే ఒక విప్లవాత్మకమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దృఢమైన నాయకత్వం, వ్యూహాత్మక స్పష్టత ద్వారా కొత్త అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవచ్చో, తద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలో ఎలా నడిపించవచ్చో అన్న అంశాలకు ఇది స్పష్టమైన నిదర్శనం.

# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

ప్రార్థనలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన



చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు.జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్యం÷-ర సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# బంగారం ధరల తిరోగమనం

## - భారీగా తగ్గిన ధరలు

**న్యూఢిల్లీ,జనవరి 30( వెలుతురు):**
గత కొన్ని రోజుల నుంచి చుక్కలు చూపిస్తున్న బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా తగ్గాయి. గురువారం ఆల్‌టైమ్ రికార్డ్ స్థాయికి చేరిన బంగారం, వెండి ధరలు శుక్రవారం అథ:పాతాళానికి పడిపోయాయి. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్ మార్కెట్‌లో 1,80,779 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కిలో వెండి ధర రూ.4,20,048 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు ఊహించని విధంగా ధరలు భారీ స్థాయిలో పతనమయ్యాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ.15,246 తగ్గింది. ప్రస్తుత ధర రూ. 1,54,157 ఉంది. వెండిపై ఏకంగా రూ. 67,891లు తగ్గింది. ప్రస్తుత ధర 3,32,002 రూపాయలుగా ఉంది. బంగారం, వెండి ధరలు ఒకే రోజు ఇంతలా పతనమవడానికి కారణం ఇన్వెస్టర్లు భారీ ప్రాఫిట్ బుకింగ్‌కు దిగటమేనని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. ఫ్యూచర్స్‌తో పోలిస్తే ఈటీఎఫ్ ధరలు మరింత పతనమయ్యాయని తెలిపారు. ఫెడ్ తదుపరి చీఫ్‌గా ఆ విభాగం మాజీ అధికారి కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తారన్న వార్తలు కూడా బంగారం, వెండి ధరలు తగ్గటానికి మరో కారణమని అనలిస్టులు అంటున్నారు.

# సంపాదకీయం.. వాస్తవ పరిస్థితులను బడ్జెట్ గుర్తించేనా?

ఏటేటా బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టడం, దానిపై పెద్దగా పట్టింపు లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టడం..తూతూ మంత్రంగా సాగిపోతోంది. దేశంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు రావడం లేదు. మూడో ఆర్థిక శక్తిగా ఎదగాలన్న మాటలకు చేతలకు పొంతన లేకుండా పోతోంది. నిజం చెప్పాలంటే ప్రజలను మభ్యపెట్టడబం తప్ప, వాస్తవాలను పాలకులు గ్రహించడం లేదు. ప్రపంచ ఆర్థిక మాంద్యం తరుముకు వస్తున్న వేళ దేశీయంగా దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. యువతకు చేతినండా పిన కల్పించడం, ధరలను అదుపు చేయడం, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం వంటి చర్యలను గుర్తించడం లేదు. అమెరికా వీసాల కట్టడితో మనదేశం నుంచి వెళుతున్న నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అక్కడా ఉద్యోగాల కల్పన అన్నది భ్రమగా మారింది. ప్రపంచంలో డాలర్ పతనం ప్రారంభం అయ్యింది. ఈ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ట్రంప్ సుంకాల కారణంగా మాన మార్కెట్లు కుదేలవుతున్నాయి. దీనిపైనా ముందస్తు వ్యూహం ఉండాలి. చెప్పాలంటే ప్రతికూల పరిస్థితుల్లో దేశం ముందుకు వెళ్లే ప్రయత్నాలు సాగాలి. మన ఉత్పత్తులను మనం ఉపయోగించే పరిస్థితి రావాలి. దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా వస్తూత్పత్తిని పెంచుకోవచ్చు. ధాన్యం దిగుబబడులకు అనుగుణంగా మార్కెట్ లేదు. ఇవన్నీ కూడా బడ్జెట్‌లో ఎప్పుడూ చర్చించడం లేదు. ప్రస్తుతం అంటే ఫిబ్రవరి1న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో చర్చిస్తారా అన్నది చూడాలి. మనకున్న సహజ వనరులను, మానవనరులను ఎలా జోడించి వినియోగించుకోగలమో అన్న ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రతిపాదనలు సాగుతున్నాయి. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్నట్లు జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ఎకనామిక్ సర్వేను ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం లో భారతదేశపు ఎకానమీ 6.8 శాతం నుండి 7.2 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా దూసుకుపోతుండటం విశేషం. మన దేశ సంభావ్య వృద్ధి రేటు సుమారు 7 శాతంగా ఉంటుందని సర్వే పేర్కొంది. దేశీయ డిమాండ్.. వృద్ధికి వెన్నెముక ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, భారతదేశం అంతర్గత బలాలు ఆర్థిక వ్యవస్థను కాపాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగడం, వ్యవసాయ రంగం మెరుగైన ప్రదర్శన కనబరచడం వృద్ధికి ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన పన్ను హేతుబద్ధీకరణ చర్యల వల్ల సామాన్యుడి చేతిలో ఖర్చు పెట్టడానికి ఎక్కువ డబ్బులు మిగులుతున్నాయని, ఇది దేశీయ మార్కెట్లో వస్తువుల డిమాండ్ పెరగడానికి దోహదపడిందని సర్వే విశ్లేషించింది. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకోగలిగేంత పటిష్టమైన బఫర్స్ భారత్ వద్ద ఉన్నాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్ల విదేశీ పెట్టుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. సవాళ్లు , భవిష్యత్తు అంచనాలు వృద్ధి రేటు బాగున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ట్రేడ్ ఫ్రాగ్మెంటేషన్, ఆర్థిక రంగంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితులపై సర్వే హెచ్చరించింది. గ్లోబల్ మార్కెట్లలో వచ్చే మార్పులు మనపై కొంత ఆలస్యంగా ప్రభావం చూపే అవకాశం ఉందని, కాబట్టి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు , స్థిరమైన స్థూల ఆర్థిక విధానాలు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక పటంలో అగ్రస్థానంలో నిలుపుతాయని ఎకనామిక్ సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. విద్యార్థులు ఏఐని విచ్చలవిడిగా వాడటం వల్ల ఆందోళన, కుంగుబాటు పెరిగి సమస్యను పరిష్కరించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా ఆర్థిక సర్వే ఆశాజనక సూచనలు చేసినా, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధ పరిస్థితి ఉంది. నిరుద్యోగం తాండవిస్తోంది. పేదరికం ఇంకా పెరుగుతోంది. వీటిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఆ మేరకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు రావాలి. సమస్యలను చర్చించి, అధిగమించే ప్రయత్నాలు చేపట్టాలి. అప్పుడే ఆర్థికంగా దేశం బలోపేతం కాగలదు.




## శ్రీవారితో ఆటలాడడం మానుకోండి

**- లేకుంటే భూస్థాపితం కాక తప్పదు**

**- వైసిపికి మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరిక**



**అమరావతి,జనవరి30( వెలుతురు):**
తిరుమల వేంకన్న స్వామితో పెట్టుకుంటే భూస్థాపితమేనని చరిత్ర చెబుతోందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ తెలిపారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడడమే గాకుండా దానిని బుకాయించే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన వైసిపి నేతలను హెచ్చరించారు. ఇప్పుపికే భక్తులు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ఇప్పటికే అసెంబ్లీ స్థానాలు 151 నుంచి 11కు పడిపోయిన వైసీపీకి ఇదొక ఉదాహరణ అని ఆ పార్టీ నేతలకు ఆయన గుర్తుచేశారు. ఇకనైనా దేవుడితో ఆటలాపితే వాళ్లకే మంచిదంటూ హితవు పలికారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..చేసిన మహా పాపాన్ని కప్పి పుచ్చుకునేందుకు వైసీపీ నేతలు చేస్తున్న విష ప్రచారాన్ని ప్రజలంతా చూస్తున్నారని పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం పదే పదే తిరుమల శ్రీవారినే టా÷-గ్గ్÷ట్ చేయటానికి కారణాలేమిటంటూ వైసీపీ నేతలను సూటిగా ప్రశ్నించారు. గతంలో వైఎస్ఆర్ సైతం ఏడుకొండలను ఐదు కొండలంటూ భక్తుల మనోభావాలు దెబ్బతీశారని గుర్తు చేశారు. తిరుమల కల్తీ లడ్డూపై సాక్షి ఛానల్ ఇచ్చిన క్లీన్ చిట్‌ను ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్) ఇచ్చినట్టుగా వైసీపీ ప్రచారం చేసుకోవటం సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు. తిరుమల శ్రీవారిపై వైఎస్ జగన్ అండ్ కో ఎందుకింత కక్షగట్టిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై దర్యాప్తు చేసిన సిట్ పూర్తి స్థాయి నివేదిక వస్తే.. వైసీపీ నేతలకు గుండెపోటులు వస్తాయని సుభాశ్ జోస్యం చెప్పారు. వైఎస్ జగన్‌కు డిక్లరేషన్ ఇవ్వకుండా ఆలయానికి వెళ్లటం, ప్రసాదాన్ని తక్కువ చేసి మాట్లాడటంతో పాటు గుడికి వెళ్లకుండానే సెట్టింగులు వేసుకోవటం అలవాటుగా పెట్టుకున్నారంటూ వాసంశెట్టి మండిపడ్డారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మనుషులు.. తిరుమలలో ఖాళీ మద్యం బాటిళ్లు పెట్టి అడ్డంగా దొరికారని విమర్శించారు. కల్తీ జరిగిందని సిట్ నివేదికలో నిర్ధారణ అయినా సంబరాలు చేసుకోవటానికి సిగ్గుందా? అంటూ వైసీపీ నేతల తీరును ఎండగట్టారాయన. దేశభక్తి లేదని ఎలాగూ తెలిసిందేనని.. తిరుమల తిరుపతి దేవస్థానం అంటే ఎందుకంత కోపమో చెప్పాలంటూ మాజీ సీఎంను మంత్రి ప్రశ్నించారు.

## కెసిఆర్‌కు నోటీసులపై బిఆర్ఎస్ నిరసన

**భద్రాద్రి కొత్తగూడెం,జనవరి 30( వెలుతురు):**
లక్ష్మీదేవిపల్లి, జనవరి 30 : మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ లక్ష్మీదేవిపల్లి శ్రేణులు భగ్గుమన్నాయి. పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపుమేరకు లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షతన పార్టీ శ్రేణులు శుక్రవారం కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్‌కు సిట్ నోటీసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బూటకపు కేసులు, విచారణలు పక్కనపెట్టి ముందు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పనులపై దృష్టి సాధించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు ఇగ్బాల్ పాషా, ప్రశాంతి నగర్ ఉప సర్పంచ్ ఎర్రబడి శ్రీను, శ్రీకాంత్ నాయక్, మాజీ సర్పంచులు తాడూరి రజాక్, కోరం చంద్రశేఖర్, పొదిలి వెంకటాచలం, బీఆర్ఎస్ మండల నాయకులు రాజావరపు మురళి, కల్లుగడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారం ధరల్లోఒడిదుడుకులు

**- ఒక్కరోజులోనే 5లక్షల కోట్లకు క్రాష్**

**- సాయంత్రానికి తిరిగి పుంజుకున్న మార్కెట్**





**న్యూఢిల్లీ,జనవరి30( వెలుతురు):**
ప్రస్తుతం ఎక్కడ చూసినా బంగారం, వెండి ధరలపై చర్చ సాగుతోంది. అనూహ్యంగా అడ్డూఅదుపుల లేకుండా పెరుగుతున్న ధరలు ఎందాక పోతాయా అన్న ఆందోళన కనిపిస్తోంది. సామాన్యుల నుంచి బడా ఇన్వెస్టర్లు, వ్యవస్థాగత మదుపర్ల వరకూ అన్ని వర్గాల వారినీ పసిడి ధరల పరుగు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ రోజు ధర ఎంత పెరుగుతుందో? ఎంత తగ్గుతుందో? అసలు పసిడిపై పెట్టుబడికి ఇది సరైన సమయమో కాదో తెలియక సామాన్యుల తలకిందులవుతున్నారు. అయితే, చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గురువారం బంగారం మార్కెట్ విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైంది. అంతర్జాతీయ అనిశ్చితులతో గత కొన్ని రోజులుగా అసాధారణంగా పెరుగుతున్న బంగారం ధర.. గురువారం రాత్రి అనూహ్యంగా ఒడుదొడులకు లోనై,గంటల వ్యవధిలో దారుణంగా ఊగిసలాడింది. కేవలం ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే పసిడి మార్కెట్ విలువ ఏకంగా 5.5 ట్రిలియన్ డాలర్ల హెచ్చుతగ్గులకు గురైందంటే.. ప్రపంచ కమొడిటీ మార్కెట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..! ఒక్క రోజులో బంగారం మార్కెట్ విలువ ఈ స్థాయిలో మార్పులు రావడం చరిత్రలో ఇదే తొలిసారి. ని స్టాక్ మార్కెట్ వ్యవహారాల కామెంటరీ వేదిక 'ది కొబేసీ లెటర్' నెట్టింట పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ది కొబేసీ లెటర్' చేసిన ట్వీట్ ప్రకారం, గురువారం ఉదయం అమెరికా కాలమానం ప్రకారం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్య బంగారం మార్కెట్ విలువ ఒక్కసారిగా 3.2 ట్రిలియన్ డాలర్ల మేర పడిపోయింది. ఆ తరువాత క్రమంగా కోలుకుని మార్కెట్స్ క్లోజ్ అయ్యే సమయానికి కనిష్ఠ స్థితి నుంచి 2.3 ట్రిలియన్ డాలర్ల మేర ఎగబాకింది. అంటే.. ఒక్క సెషన్‌లోనే బంగారం మార్కెట్ క్యాపిటలైజేషన్ హెచ్చుతగ్గుల విలువ 5.5 ట్రిలియన్ డాలర్లను చేరింది. బంగారానికి ఉన్న వాస్తవ డిమాండ్‌కు మించి ధరల్లో ప్రస్తుతం హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. భౌగోళిక అనిశ్చితులు, డాలర్ బలహీనత, అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి వంటి వాటితో పాటు ఇతర కీలక అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా వ్యవస్థాగత మదుపర్లు కమోడిటీ మార్కెట్స్‌పై దృష్టిపెట్టడం, ఆల్గోరిథమ్-ఆధారిత ట్రేడింగ్ పెరగడం, బంగారం హెచ్చుతగ్గుల ఆధారంగా డెరివేటివ్ మార్కెట్స్‌లో కూడా ట్రేడింగ్ అధికమవడంతో పసిడి ధరలు అంచనాలకు మించి హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి.పసిడితో పాటు వెండి, ఎ÷-లాటినమ్, పెలాడియం వంటి విలువైన లోహాలన్నీ ఇదే స్థాయిలో ఒడిదుడుకులకు లోనుకావడం కమోడిటీ మార్కెట్స్‌లో ఒత్తిడికి సూచిక అని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా బంగారం ధరలకు ఈ ఏడాది బ్రేకులు ఉండకపోవచ్చని ప్రముఖ కన్‌స్టలెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్స్‌లో ఔన్స్ మేలిమి బంగారం ధర 6 వేల డాలర్ల మార్కు దాటొచ్చనేది మెజారిటీ మార్కెట్ విశ్లేషకుల అంచనా. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్యయుద్ధాల నేపథ్యంలో కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు, ద్రవ్యోల్బణ భయాలు, వడ్డీరేట్లపై అస్పష్టత వంటి అనేక కారణాలతో ఈ మధ్య మదుపర్లు బంగారం, వెండి లోహాల్లో పెట్టుబడులను సురక్షిత సాధనంగా భావించారు. దీంతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. అయితే, గరిష్ఠాల వద్ద సంస్థాగత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో గురువారం వీటి విలువ ఒక్కసారిగా తగ్గింది. దీనికితోడు కంప్యూటర్ ఆధారిత ఆటోమెటిక్ అల్గారిథమ్ ట్రేడింగ్ కూడా ధరల కదలికలను తీవ్రంగా ప్రభావితం చేసిందని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. నేటి రోజుల్లో బంగారం ట్రేడింగ్ అనేది భౌతిక బంగారం డిమాండ్ మీద మాత్రమే ఆధారపడట్లేదని, ఈటీఎఫ్‌లే మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు.

## స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తు

**- రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా**

**- బావమరదికి ఫోన్ చేసి మరీ భార్యను చంపిన దుర్మార్గుడు**



**న్యూఢిల్లీ,జనవరి30( వెలుతురు):**
దేశ రాజధాని నగర పోలీసు విభాగంలో స్వాట్ కమాండోగా పనిచేస్తున్న కాజల్ చౌధరి(27)ని ఆమె భర్త అంకుర్ డంబెల్‌తో కొట్టి చంపిన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మృతురాలి సోదరుడు నిఖిల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. హత్యకు సంబంధించిన పలు కీలక విషయాలు వెల్లడించాడు. 'హత్యకు ముందు నా సోదరి కాల్ చేసి, తన భర్త వేధిస్తున్నట్లు చెప్పింది. అదే సమయంలో అక్కడే ఉన్న అంకుర్ ఆమె నుంచి ఫోన్ లాక్కొని రికార్డు చేసి పెట్టుకో.. పోలీసులకు ఆధారంగా పనికొస్తాయి. మీ అక్కను చంపుతున్నా అని బెదిరించాడు. ఆ సమయంలో అతడిని ఎంత సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ నా మాటలు వినలేదు. కొంతసేపటి తర్వాత అంకుర్ కాల్ చేసి, కాజల్ చనిపోయిందని.. గాజియాబాద్ ఆస్పత్రికి వచ్చి చూసుకొమ్మని చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి వెళ్లగా గర్భిణి అయిన నా సోదరి మృతిచెంది ఉందని సోదరుడు నిఖిల్ బావురుమన్నాడు. 2023లో అంకుర్‌తో కాజల్ వివాహం అయిన సమయంలో పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చామని, అయినా అత్తింటివారు అదనపు కట్నం కోసం తన కుమార్తెను వేధించేవారని మృతురాలి తల్లి ఆరోపించింది. రక్షణశాఖలో క్లర్కుగా పనిచేస్తున్న అంకుర్‌కు ఆర్థికపరమైన అంశాల్లో భార్య కాజల్‌తో తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 22న దంపతుల మధ్య గొడవ తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, డంబెల్‌తో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాజల్ గాజియాబాద్ ఆసుపత్రిలో అయిదు రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం మృతి చెందగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంకుర్‌ను అరెస్టు చేసిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీలోని మోహన్ గార్డెన్ ప్రాంతంలో కాజల్-అంకుర్ నివాసంలో ఈ ఘటన జరిగింది. భర్త.. నిందితుడైన అంకుర్ తన భార్య కాజల్ తలని తలుపు ఫ్రేమ్‌కు బలంగా కొట్టి, ఆపై బరువైన డంబెల్ తో ఆమె తలపై దాడి చేశాడు. దాడి సమయంలో కాజల్ నాలుగు నెలల గర్భిణీ. ఆసుపత్రిలో ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, జనవరి 27న కమాండో కాజల్ కన్నుమూశారు. కట్నం వేధింపులే తమ బిడ్డ హత్యకు ప్రధాన కారణమని కాజల్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు అంకుర్ చౌదరి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్కుగా పనిచేస్తున్నాడు. పెళ్లిలో బుల్లెట్ బైక్, బంగారం ఇచ్చినప్పటికీ, కారు ఇవ్వలేదని అతను తరచూ కాజల్‌ను వేధించేవాడని తెలుస్తోంది. పోలీసులు.. నిందితుడు అంకుర్ చౌదరిని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపారు. ముందుగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. కాజల్ మరణం తర్వాత దానిని హత్య కేసుగా మార్చారు. కాజల్-అంకుర్ దంపతులకు ఇప్పటికే ఒకటిన్నర ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాబు కాజల్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.

# ఒక బీసీ బిడ్డ డీసీసీ అధ్యక్షులైతే అయితే అతనికి అధికారాలు ఉండవా ??

- నల్గొండ డిసిసి అధ్యక్షుడి ప్రమేయం లేకుండానే కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించి అవమానిస్తారా
- బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 30:**
డీసీసీ అధ్యక్షుడుగా ఒక బీసీ బిడ్డ ఉంటే అతనికి అధికారాలు ఉండవా ?? అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు.నల్గొండ జిల్లాలో ఉన్న డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత ప్రమేయం లేకుండానే జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల లిస్ట్ ను ప్రకటించి బీ ఫాంములు రెడీ చేసి అవమానిస్తారా అని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు.సామాజిక న్యాయం, ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా తొక్కతోలు అని మాట్లాడే కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఇప్పుడు ఏమి సమాధానం చెబుతుందో చూడాలన్నారు.

# కోటి ఈ యన్ టి హాస్పిటల్లో నూతన డైరీ క్యాలెండర్ ను హాస్పిటల్ సూపరిండెంట్ కు అందజేసిన టిఎన్జీవోస్




**బషీర్ బాగ్ వెలుతురు 30 జనవరి :**
కోటిలోని ప్రభుత్వ ఈ.ఎన్.టి ఆసుపత్రిలో టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీ విక్రమ్ కుమార్ మరియు కార్యదర్శి శ్రీ కురాడి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ మరియు డైరీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నేతలు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద ఆచార్య మరియు ఆర్.ఎమ్.ఓ డాక్టర్ అనిల్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి డైరీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కేఆర్ రాజ్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ వైదిక శాస్త్రి, కార్యదర్శి శ్రీధర్ నాయుడుతో పాటు యూనిట్ ప్రతినిధులు భాస్కర్, రవి, శ్రీహరి, సునీల్ కుమార్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. ఇదే సందర్భంలో ఈ.ఎన్.టి యూనిట్ అధ్యక్షులు తూముకుంట రాజు ఆసుపత్రిలో ఎదురవుతున్న పలు సమస్యలను జిల్లా నేతల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎక్స్-రే మరియు ల్యాబ్ టెక్నీషియన్ల కొరత కారణంగా రోగులకు సేవలు అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దీనిపై జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సానుకూలంగా స్పందిస్తూ, ఈ సమస్యను వెంటనే డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (ఇ.ఎ) దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవోస్ ఎల్లప్పుడూ ముందుంటుందని వారు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# ఆరుట్ల గ్రామంలోప్రారంభం అయిన వేణుగోపాలస్వామి జాతర బ్రహ్మోత్సవాలు

- కలశ స్థాపన అంకురార్పణ రక్షాబంధనం కార్యక్రమంలో పాల్గొన్న ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ వార్డు సభ్యులు పెద్ద లు



**మంచాల వెలుతురు జనవరి 30:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వేణుగోపాలస్వామి జాతర బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు అంగ రంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి శుక్రవారం రోజు కలశ స్థాపన అంకురార్పణ రక్షా బంధనం కార్యక్ర మాలు వేణుగోపాలస్వామి దేవాలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసికార్య క్రమాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మానిపాటి శోభ కుమార్ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పా ల్గొని వేణుగోపాలస్వామి కి ప్రత్యేక పూజలుచేశారు ఈ సం దర్భంగా దేవాలయ పూజారి శ్రీధర్ మాట్లాడుతూ శనివారం ఉదయం 8గంటలకుఅగ్నిప్రతి ష్టాపన ద్వజరోహణంగరుడ మూడ కార్యక్రమాలు సాయంత్రం 5-30 నిమిషాలకు అ శ్వవాహనం రాత్రి 8 గంటలకు శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామివారి కళ్యాణ మహోత్సవంఉంటుంది అ ని అన్నారు ఆదివారం రోజు ఉదయం 8 గంటలకు హోమ కార్యక్రమం బలిహారన సాయంత్రం 5గంటలకు పల్లకిసేవ రాత్రి 8 గంటలకు రథంగహోమంసోమవారం ఉదయం 7 గంటలకు వేణు గోపాలస్వామి రథోత్సవంప్రారంభం అవుతుంది అని అన్నారు గ్రామ ప్రజలు భక్తులు వేణుగో పాలస్వామి జాతర బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి హాజరుకావాలని అన్నారు ఈ కార్యక్ర మం లోమాజీ ఎంపీటీసీలు చీరాల రమేష్ కావలి శ్రీనివాస్ ముదిరాజ్ మాజీ డైరెక్టర్ కొంగర జనార్దన్ రెడ్డి ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ మాజీ ఉప సర్పంచ్ పాండాల జంగయ్య గౌడ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పంది శేఖర్ కొండిగారి శ్రావణ్ మంకు మమత వినోద్ మంద మాధవి మోహన్ రెడ్డి పున్నం రాము రావుల జంగయ్య భానుప్రసాద్ మాడుగుల బాల మణి కృష్ణ గౌడ్ మొగ్రిపద్మ ఐలయ్య లాలగారి మన్నెమ్మ సాతిరి సత్యం గ్రామ పెద్దలు పాండాల యాదయ్యగౌడ్ దంటు మధుసూదన్ రెడ్డి లొంగగారి మారయ్య వెదిరె రమణారెడ్డి చిందం రఘు పతి వెదటి భాస్కర్ రావుల ఐలయ్య వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ప్రజాగళందామెర భూపాల్ చిందం జంగయ్య పుణ్యమూర్తి సత్తయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు



ఆరుట్ల వేణుగోపాల స్వామి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్

# ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాల్సిందే

- బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 30:**
మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పునరుద్ధరించి విస్తరించాలని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు పత్రికల వారితో మాట్లాడుతూ స్త్రీ పురుష కూలీలు తట్టలు ఎత్తి 100 రోజులు ఉపాధి పొందాలని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో ప్రవేశపెట్టిన పథకాన్ని బుట్ట దాఖలు చేస్తామంటే ఊరుకునే ప్రసక్తి లేదని ఆ పథకాన్ని ఆరు నూరైనా "చెయ్యి "జారనీయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకాన్ని కాల రాయడం అంటే రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాయడమేనని అన్నారు. స్వాతంత్ర్యానికృతం దేశంలో ఏ విధమైన పరిస్థితులు ఉన్నాయో ఆనాటి చీకటి బతుకులను గుర్తు చేసేలా రోజులు దాపరించాయని అధికారాన్ని కేంద్రీకరించి పేద ప్రజలను ఆకలితో చంపేందుకు కొత్త చట్టం తెరపైకి తెచ్చారని చట్టాన్ని సంస్కరించే పేరుతో దాని నుండి ఆర్థిక భద్రతను తొలగించారని అన్నారు. కేంద్రం



హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఉపాధి హామీ పనులు చూపలేక పేదలకు పట్టెడు అన్నం పెట్టకుండా, ఉన్న పథకాన్ని రద్దు చేశారని ధ్వజమెత్తారు.

**బీసీలే కేంద్రంగా ప్రజా పాలన సాగుతుంది**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన బీసీలే కేంద్రంగా సాగుతుందని గుర్తు చేశారు కులగణన చేయించిన ఘనత మా నాయకుడు రాహుల్ గాంధీకి దక్కుతుందని కుల గణన సర్వే ద్వారా బీసీల జనాభా 56% ఉందంటూ అధికారిక డాక్యుమెంట్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు విద్యా ఉద్యోగం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కోసం మూడు చట్టాలను చట్టసభలలో ఆమోదించి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేస్తే రాష్ట్రపతి గవర్నర్లు పెండింగ్లో పెట్టుకున్నారని అన్నారు. 2029లో జరిగే లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకువచ్చి రాహుల్ గాంధీని ప్రధాని చేస్తే 42% రిజర్వేషన్లపై చట్టబద్ధత తెచ్చుకుంటాం అని అన్నారు.

**ప్రజల జీవితాలలో మార్పుతోనే అభివృద్ధి**

అభివృద్ధి అంటే కేవలం భవన నిర్మాణాలే కాదని ప్రజల జీవితాలలో మార్పులు తేవడమే నిజమైన అభివృద్ధి అని ప్రజా ప్రభుత్వం హామీలను ఒక్కటి ఒక్కటిగా అమలు చేస్తుందని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్య వైద్యంతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వం కేవలం పథకాలు ప్రకటించడమే కాదు వాటిని లబ్ధిదారులకు చేర్చేలా చర్యలు తీసుకుంటుందని నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

# నాణ్యమైన పనులతోనే ప్రమాదాలు తగ్గుతాయి

- నాణ్యమైన పరికరాలనే వాడాలి అగ్ని ప్రమాదాలు నివారించాలి
- మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు
- తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల 12వ వార్షికోత్సవ మహాసభలో సీఈఐజీ








**హైదరాబాద్ వెలుతురు జనవరి 30:**
హైదరాబాద్, విద్యుత్ పనులను నాణ్యతగా చేయాలని, అప్పుడే నష్టాలు తగ్గుతాయని తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి సిహెచ్ కే నందకుమార్ ఆన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల 12వ వార్షికోత్సవ మహాసభలో 2026 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన తర్వాత ఆ యన మాట్లాడారు. విద్యుత్ ప్రమాణాలు జరగకుండా ఉండాలంటే నాణ్యమైన వి ద్యుత్ పరికరాలనే వాడాలని సూచించారు. జాగ్రత్తలు పాటిచడం ద్వారనే ఎలక్ట్రికల్ విద్యుత్ ప్రమాదాలను ఆ నివారించగలమన్నారు. నాణ్యతలేని పరికరాలను వాడడం వల్ల అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నా రు. విద్యుత్ సరఫరాలో లోపాలను గుర్తించకపోవడం, ఫైర్ ఆడిట్ నిర్వహించక పోవడంతో పాటు మానవత ప్పిదాలు ఇందుకు కారణమవుతు న్నాయి. ఫైర్ ఎక్స్టింగ్విషర్ల వంటి పరికరాలు ఏర్పాటు చేయకపోవడంతో మంటలు అదుపు చేయడంలో అలస్యమై ఆస్తినష్టం వాటిల్లుతోంది. విద్యుత్ మరమ్మ తులు క్వాలిఫైడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ తో మరియు ఎలక్ట్రి ప్రియన్ తో మాత్రమే చేయించాలన్నారు. అతుకులు కలిగిన తీగలు, లూజ్ వైరింగ్ ప్రమాదకరమని అన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జీసీరెడ్డి మాట్లాడుతు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించు కోగలు గుతామని అన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నాణ్యమైన విద్యుత్ పరికరాలను వాడాలని అదేవిధంగా అసోసియేషన్ ఐక్యత ఉన్నప్పుడే సమస్యకు పరిష్కారం మార్గం దొరుకుతుందని ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఉద్దేశించి అన్నారు. విద్యుత్ అధికారుల నుంచి సమస్యలు ఎదురైతే సంఘం దృష్టికి తీసుకుని రావాలని, అం దరం ఒక్కటిగా వెళ్లి సమస్యను పరిష్కరించుకుందామన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ఏర్తింగ్ పటి ష్టంగా ఏర్పాటు చేసుకోవాలని, ఎర్తింగ్ విషయంలో నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని అన్నా రు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నామిని వెంకటేష్ నేత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. మహేందర్. వి.పెద్ద పుల్లారావు, మస్తాన్. ఏ ఎస్ ఆర్. యు శీను. ప్రేమ్. రాష్ట్ర నాయకులు కే శ్రీనివాస్ .ఎం వెంకటేష్. రాజు మహారాజ్ , మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కనుక చారి. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి. వెంకట్ రెడ్డి చిన్న పుల్లారావు. ప్రదీప్ రెడ్డి, భరత్రెడ్డి, బాల్ రెడ్డి. వివిధ కంపెనీల ప్రతినిధులు కూడా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక అవుతాం

- ప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే మా ఎజెండా
- డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి, వెలుతురు ప్రతినిధి :**
మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీ పొలిటికల్ జెఏసి బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల పక్షాన సమస్యలపై ప్రశ్నించే గొంతుక అవుతారని, ప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే మా ఎజెండా అని జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని



3వ వార్డు నుంచి బీసీ పొలిటికల్ జెఏసి కౌన్సిలర్ అభ్యర్థిగా దేవర శివ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. పాత బజార్ నుంచి బిసి పొలిటికల్ జేఏసీ నాయకులు వార్డు ప్రజలతో కలిసి భారీ ర్యాలీతో మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పట్టణంలో ప్రజలకు విద్య, వైద్యంతో పాటు ఏ సమస్య వచ్చినా బీసీ పొలిటికల్ జేఏసీ ముందు వరుసలో ఉండి సమస్యల పరిష్కారానికి పోరాటం సాగించిందన్నారు. గత మున్సిపల్ కౌన్సిల్ లో అన్ని పార్టీల కౌన్సిలర్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టడంతో పాటు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. బీసీ పొలిటికల్ జేఏసీ చేసిన పోరాట ఫలితమే నేడు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు మళ్లీ మొదలయ్యాయని, అలాంటి మాకు ఒకసారి ప్రజలు అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పార్టీల అభ్యర్థులు గెలుపొందిన తర్వాత వారి వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటారు కానీ, బీసీ పొలిటికల్ జేఏసీ మాత్రం అలా కాదన్నారు. మొదటగా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటం చేసిన తర్వాతే ఎన్నికల బరిలో నిలుస్తూ రాజకీయంగా ముందుకు వస్తున్నామన్నారు. మూడో వార్డు తరఫున బరిలో ఉన్న బీసీ పొలిటికల్ జేఏసీ పట్టణ అధ్యక్షుడు దేవర శివను ప్రజలు ఆశీర్వదిస్తే కౌన్సిలర్ గానే కాకుండా ఉన్నత స్థానంలో ఉండి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో, మంత్రులతో, స్థానిక ఎమ్మెల్యేలతో బీసీ పొలిటికల్ జేఏసీకి ఉన్న అనుబంధాన్ని ఉపయోగించి పట్టణ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి నాయకులు వివి గౌడ్, ధర్మేంద్ర సాగర్, నారాయణ సాగర్, నాగరాజు, నరేందర్ సాగర్, యశ్వంత్ గౌడ్, పేట శివ యాదవ్, రాజోలి సురేష్, మహబూబ్, చాంద్ పాషా, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు


# ఇద్దరు విద్యార్థుల కోసం ప్రభుత్వం బడి



**వనపర్తి, వెలుతురు ప్రతినిధి :**
జపాన్ దేశంలో కేవలం ఒక విద్యార్థి కోసమే తన పాఠశాలకు వెళ్లడం సౌకర్యం ప్రభుత్వం రైలు సౌకర్యాన్ని కల్పించింది.మన తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా నందు కేవలం ఒక్క విద్యార్థి ఉన్న పాఠశాలలో కూడా ఒక ఉపాధ్యాయురాలును కేటాయించి విద్యలో ఆ అమ్మాయికి అసౌకర్యం కలవకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించింది. అదేవిధంగా మన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం జనంపల్లి గ్రామంలో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. స్థానిక మండల విద్యాధికారి జయ రాములు ప్రోత్సాహముతో శాఖ పురములో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు కే. నరసింహనా యుడుని జనం పల్లికి డిప్యూటేషన్ పై పంపి పిల్లలకు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు.ఈ సంవత్సరం ప్రభుత్వం పాఠశాలలో గల మౌలిక వసతులు ప్రభుత్వం అందిస్తున్నటువంటి వసతులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఏ విధంగా అందుతాయావ్ పర్యవేక్షించడానికి జిల్లా పర్యవేక్షణ బృందాలను నియమించింది ఈ బృందం శుక్రవారం



జనంపల్లి పాఠశాలను సందర్శించిన సమయంలో కేవలం ఇద్దరు విద్యార్థుల కోసం ఒక రెగ్యులర్ ఉపాధ్యాయునితో పాటు పార్ట్ టైం స్వీపర్ కూడా నియమించి వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. అని వారి పరిశీలనలో తేలినది. ఈ పరిశీలన బృందంలో గల సభ్యులు మన్య, మురళీకృష్ణ ప్రభుత్వంలో జరుగుతున్నటువంటి అన్ని రికార్డ్స్ ను పరిశీలించడంతోపాటు స్థానిక ఉపాధ్యాయునికి కూడా మెలకువలను అందించడంతోపాటు, విద్యార్థులను బడివైపుకు ఉత్సాహాన్ని పెంచడం కొరకు వారితో ఆటపాటలతో అలరిం చారు. విద్యార్థులతో కబడ్డీఆటను కూడా ఆడారు. పర్యవేక్షణ బృందాల యొక్క బాధ్యత కేవలం పర్యవేక్షనే కాదు విద్యార్థుల సంఖ్యను పెంచడం అదేవిధంగా ఉపాధ్యాయులకు సరైనటువంటి మార్గ నిర్దేశం చేయడం ఆటపాటలతో విద్యాభ్యాసం ఏ విధంగా చేయాలన్నటువంటి అంశంపై సదరు ఉపాధ్యాయునికి సరైన మార్గనిర్దేశం పర్యవేక్షణ బృందం అందించింది.



# వెలుతురు దినపత్రిక నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన మంచాల పోలీస్ స్టేషన్ సిఐ మధు

**మంచాల వెలుతురు జనవరి 30:**
మంచాల మండలం కేంద్రంలో మంచాల పోలీస్ స్టేషన్ లో వెలుతురు దినపత్రిక క్యాలెండర్ ఆవి ష్కరించిన మంచాల సీఐ మధు ఈ సంద ర్భంగా సిఐ మధును మాట్లాడుతూ ప్రజాసమస్యలు గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగిన నిజాన్ని నిర్భయంగా వ్రాసి ప్రజలకు తెలిసేలా చేసేది ఒక మీడియా పత్రికా రిపోర్టర్లు అన్నారు అని అన్నారు ప్రజలసమస్యలు అధికారుల దృష్టికి వె ళ్ళేలా చేసేది మీడియా పత్రిక రిపోర్టర్లు అన్నారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచాల మం డలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలిబుగ్గరాములు ముదిరాజ్ఎస్టి సెల్ నాయకుడు నేనావత్ శ్రీనివాస్ నాయక్ మంచాల గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు మల్గా శ్రీశైలం బీసీ సంఘం నాయకులు అశ్వాల బాలరాజు కడారి లింగం ఇబ్రహీంపట్నంనియోజకవర్గం వెలుతురు దిన పత్రిక రిపోర్టర్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ పోలీస్ కానిస్టేబుల్ లు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 30:**
శుక్రవారం రోజు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించించిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిల్లకంటి శ్రీకాంత్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశం కోసం మహాత్ముడు చేసిన త్యాగాలు స్మరించుకుందాం . సత్యం అహింస అనే ఆయుధాలతో స్వాతంత్రం సాధించిన బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలిడ ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఇచ్చే నిజమైన నివాళిగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసునూరి శ్రీనివాస్ ,మండల అధ్యక్షుడు ఇడుకుల్ల బిక్షమయ్య,పట్టణ కోశాధికారి బండారు శ్రీనివాస్,వేణుగోపాల స్వామి దేవస్థానం ఛైర్మన్ దోసపాటి ప్రసాద్,పట్టణ గౌరవ సలహాదారు బూరుగు జనార్దన్,దోసపాటి కొటేశ్వర్,యూత్ అధ్యక్షుడు పసునూరి సంపత్,వాసవి క్లబ్ చైర్మన్ మంచికంటి సంతోష్, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు దోసపాటి విష్ణు మూర్తి బండారు రమేష్,వాసవి క్లబ్ కోశాధికారి గర్రె వెంకన్న,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు ఆంద్ర ప్రభ రిపోర్టర్ పసునూరి చంద్ర శేఖర్ శివాలయం చైర్మన్ పుల్లెంల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి నివాళులర్పించి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య..



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 30:**
చిట్యాల మున్సిపాలిటీకి చెందిన గ్యార ఇంద్ర గారు అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య వారి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నార్కెట్‌పల్లి మండలం కొండపాకనగూడెం గ్రామానికి చెందిన కొమనబోయిన నరసింహ గారు అనారోగ్యంతో మృతిచెందగా, వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక నార్కెట్‌పల్లి మండలం జూగూడెం గ్రామ సర్పంచ్ చింత అనిల్ గారి మాతృమూర్తి గారు అనారోగ్యంతో మృతిచెందగా, వారి పార్థివ దేహానికి కూడా పూలమాల వేసి చివరి నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు దూదిమెట్ల సత్తయ్య బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొలువుదీరిన మినీ సమ్మక్క సారలమ్మ



**గుండాల జనవరి 30(వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో మినీ సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా జరుపుకుంటున్నారు. సమ్మక్క సారలమ్మ జాతర పూజారి వట్టిపల్లి బిక్షపతి ప్రతిసారి లాగానే సారక్కను మాసంపల్లి గ్రామం నుండి సమ్మక్కను ఎర్రబోల్ల గట్టు నుంచి డబ్బు సప్పుల్లా వాయిదాలతో శివసత్తులు పూనకాలతో అమ్మవార్లను తీసుకువచ్చి గద్దెలపై కొలువుతీర్చినారు ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి వట్టిపల్లి రేణుక బిక్షపతి మాట్లాడుతూ ఈ జాతరను 13 సంవత్సరాల నుండి జరుపుకుంటున్నామని అన్నారు. ఇక్కడికి వచ్చినా భక్తులకు మొక్కులు మొక్కుకున్న భక్తులకు అమ్మవార్లు ఆశీర్వదించి కోరుకున్న కోరికలు తీరుస్తుందని నమ్మకంతో ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో ప్రతిసారి లాగానే వస్తున్నారని తెలియజేశారు గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ లను దర్శించుకుని భక్తులు వారి యొక్క మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాలి పద్మ వెంకన్న, ఉప సర్పంచ్ మల్లెపాక నరేష్, పెగ్యపురం శ్రీను, మల్లెపాక మల్లేశ్, పాలడుగు కొమురయ్య, వార్డు మెంబర్లు చిలుకూరిమురళి మోహన్, వివిధ గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డు అందుకున్న గాలయ్యను సన్మానించిన నాయకులు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 30:**



మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ,సీనియర్అస్టెంట్ గాలయ్య ఉద్యోగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందున జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కక్కిరేణి రవీందర్, మినుముల సందీప్, సోషల్ మీడియాలో మండల కో ఆర్డినేటర్ ఎండి అజార్, మహమ్మద్ రిజ్వాన్ పాల్గొన్నారు.

## శంకర్ గుట్ట బ్రహ్మోత్సవ ఆహ్వానం పత్రిక ఆవిష్కరించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 30:**
శ్రీ ఇంద్రపాల శంకర్ స్వామి బ్రహ్మోత్సవ ఆహ్వానం గోడ పత్రికను ఆవిష్కరించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ . కళ్యాణం శివరాత్రి రోజు తేది 15 ఫిబ్రవరి రాత్రి 11.40నిముషాలకు జరుగుతుంది. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి , వార్డ్ మెంబెర్ లు వరికుప్పల స్వామి,దేవస్థానం ఉత్సవ కమిటీ అధ్యక్షులు సింగణబోయిన పాండరి యాదవ్ , కమిటీ సభ్యులు,యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్ , మందడి విద్యాసాగర్ రెడ్డి ,శ్రీధర్ రెడ్డి , రేపాక సత్తయ్య, రవ్వ నరసింహ, సింగన బోయిన జంగయ్య ,శ్రీశైలం , సత్యనారాయణ, దాసు,వీర్లపల్లి మల్లయ్య , రాజన్న రమేష్ ,తౌటమ్ శంకరయ్య, గర్దాస్ వెంకటేశం ,కన్నయ్య, పద్మారావు ,కొలు కుల పెల్లి యాదయ్య ,బాజా నరేందర్ ,గునిగంటి రామలింగం,మర్రి యాదయ్య,వెంకటేశం ,సత్తయ్య, శంకర్ ,జిట్టబోయిన వెంకటేశం, నక్క వెంకటేష్ ,గండు ఆంజనేయులు, కంబాలపల్లి శ్రీశైలంగారు,మర్రి మహేష్ ,కోటపల్లిమహేష్ ,బోనగిరి సంజీవ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ప్రారంభం

**- సర్పంచ్ నేతకాని కృష్ణయ్య**





**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 30:**
నార్కట్ పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలో శుక్రవారం నాడు పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులలో ఉచిత గర్భకోశ సంబంధ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ డాక్టర్ మాట్లాడుతూ. పశువులన్నింటికీ టీకాలు తప్పనిసరిగా చేసుకోవాలని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు లంప స్కిన్ వ్యాధి, ఈగలు,దోమలు, గోమార్లు ద్వారా వ్యాపిస్తుందని పశువులను శుభ్రంగా ఉంచుకోవడం సైపర్ మెట్రిన్ ద్రావణాన్ని 2 ఎమ్ ఎల్ ఒక లీటర్ నీటిలో పిచికారి చేయడం వలన వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ఉచిత గర్భకోశ నివారణ శిబిరం రేగట్టే గోపాల్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన అనంతరం సర్పంచ్ నేతకాని కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను విధిగా రైతులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించి పశువులకు ఖనిజలవన మిశ్రమాన్ని మందులను ఉచితంగా అందజేశారు ఈ శిబిరంలో లంపస్కిన్ వ్యాధి టీకాలు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు గ్రామ పాడి రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమనగంటి జలందర్ రెడ్డి ,పిఎసిఎస్ డైరెక్టర్ గడుసు శశిధర్ రెడ్డి,చెరువుగట్టు వార్డు సభ్యులు ఖమ్మంపాటి వెంకటయ్య ,రేగట్టే ప్రియాంక నరేష్ రెడ్డి కూకుట్ల శ్రీకాంత్ ,నాయకులు మల్ల శంకర్ ,దీప రాజేందర్ రెడ్డి ,మల్ల నర్సింహా,చీర సత్తయ్య,మల్ల లింగస్వామి,కడగంచి రమేష్,పశుసంవర్ధక శాఖ డాక్టర్లు మరియు అధికారులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు...

# మండల స్థాయి సీఎం కప్ క్రీడలు ప్రారంభం

**తిరుమలగిరి (సాగర్) వెలుతురు న్యూస్ జనవరీ 30:-**
మండల కేంద్రంలోని స్థానిక పీఎం శ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల విద్య అధికారి కొనమంచిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాల పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిధులు గా స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ వీరశేఖర్ కబడ్డీ పోటీలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిగా స్థానిక సర్పంచ్ పగడాల పున్నమ్మ సలహాదారు ప్రజాసేవకుడు పగడాల సైదులు వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ క్రీడల్లో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి కబడ్డీ వాలీబాల్ ఖోఖో కరాటే అథ్లెటిక్స్ లనుండి సుమారు 100మందికి పైగా క్రీడాకారులు వచ్చారు.

*150మందికి పైగా భోజన సదుపాయం కల్పించిన ప్రజా సేవకుడు పగడాల సైదులు*



స్థానిక సర్పంచ్ పగడాల పున్నమ్మ సలహాదారులు ప్రజా సేవకుడు సైదులు స్వయంగా వారి ఖర్చులతో 150మందికి భోజన సదుపాయం కలిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో అన్ని రకాల ఆటలాల్లో నైపుణ్యం కలిగిన ఆటగాళ్ళను గుర్తించి మండల జిల్లా రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా ప్రోత్సహాయించి తెలంగాణ రాష్టం తరపున రాబోయే ఓలంపిక్స్ కి అందించాలి అనే ఉద్యేశం తో సీఎం కప్ ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ సత్యనారాయణ రిటైర్డ్ పి ఈ టీ జ్వాలా నర్సింహా రావు అమృత్తయ్య జార్జ్ రాములు సాయిబాబా లక్ష్మీరం వినయ్ కుమార్ భాను జగదీశ్ బ్రాహ్మం తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికల వేళ...బిఆర్ఎస్ లో చేరికల జోష్



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 30:**
చిట్యాల మున్సిపాలిటీ 10వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిమ్మనగోటి శ్రీను మరియు యువశక్తి యూత్ కి చెందిన వంద మంది యువకులు శుక్రవారం రోజు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు.. గత పదేండ్లలో కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసే ప్రజలంతా మళ్ళీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది.. అమలుకాని హామీలు, మోసపూరిత గ్యారెంటీలతో కాంగ్రెస్ గద్దెనెక్కికూర్చింది.. రెండేళ్లలో పైసా పని చెయ్యని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి... బిఆర్ఎస్ హయంలో కేసీఆర్ నాయకత్వంలోనే చిట్యాల అభివృద్ధి జరిగింది... కేసీఆర్ ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 40 కోట్లతో మున్సిపాలిటీలో అనేక పనులు చేపట్టాం.. అధికార కాంగ్రెస్ నాయకులు మీ ఇంటి చుట్టూ తిరుగుతూ ఉంటారు.. నాడైనా నేడైనా అధికారిక , రాజకీయ పదవుల్లో యువతకి పెద్ద పీట వేసింది బిఆర్ఎస్ పార్టీనే.. కాంగ్రెస్ బెదిరింపులకు ఎవ్వరూ భయపడకండి మళ్ళీ రెండేళ్లలో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే... ఎన్నికలు వేస్తే



అక్రమ కేసుల పేరిట బిఆర్ఎస్ పార్టీ నాయకులను కాంగ్రెస్ వేధిస్తోంది.. రాజకీయ నాయకులను వేధించడానికే రేవంత్ రెడ్డి పోలీసులతో సిట్ ను ఏర్పాటు చేసుకున్నాడు... తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన కేసీఆర్ కి నోటీసుల పేరిట ఇబ్బందులు పెడుతున్న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి అర్హుడు కాదు... డైవర్షన్, అటెన్షన్ పాలిటిక్స్ తో కాంగ్రెస్ మంత్రులు కాలయాపన చేస్తున్నారు... కాంగ్రెస్ పార్టీది ప్రజా పాలన కాదు ముమ్మాటికి కక్ష సాధింపు పాలన.. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలి.. విజన్ తో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్ పాలనా గురుంచి ఇంకా దేశమంతా చర్చించుకుంటుంది...చిట్యాల మున్సిపాలిటీలో ప్రతీ ఓటరు బిఆర్ఎస్ పార్టీ పై సానుకూల స్పందన కనబరుస్తున్నారు... చిట్యాల మున్సిపాలిటీలో అన్ని వార్డులను బంపర్ మెజారిటీతో గెలిపించి కేసీఆర్ కి బహుమతిగా పంపుదాం.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎన్నికల ఇంచార్జి చాడ కిషన్ రెడ్డి మరియు ఇతరులు పాల్గొన్నారు...

# నగరోత్సవంతో ముగిసిన చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 30:**

చెరువుగట్టు శ్రీ పార్వతి జడలరామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం గట్టు కింద చెరువుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాలలో గజవాహనముపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. ఇఓ మోహన్ బాబు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ప్రత్యేక లైట్ల అలంకరణతో చేసిన ఏర్పాట్లు, వివిధ వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ఇంటి ముందుకి వచ్చిన ఆదిదంపతులకు నివాళులతో స్వాగతం పలికి, నీళ్లు ఆరబోసి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

బ్రహ్మోత్సవాలలో చివరి అంకం ఊరేగింపుతో పూర్తవుతుంది. ఊరేగింపు అనంతరం అమ్మవారిని గట్టు కింద ఆలయంలో ప్రవేశింపజేస్తారు. అదేవిధంగా స్వామివారిని గట్టుపైన ఆలయంలో ఆసీనులుగావించారు. ఈ కార్యక్రమంలో ఈవో మోహన్ బాబు, చెరువుగట్టు సర్పంచ్ నేతగాని కృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ వారాల రమేష్, రేగట్టే నవీన్ రెడ్డి, గడుసు శశిధర్ రెడ్డి, ధర్మకర్తలు కమ్మలపల్లి మల్లేష్, ఇడుకుళ్ళ సంపత్, రాజశేఖర్ రెడ్డి, గౌరీ దేవి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# సీసీ కెమెరా లను ప్రారంభించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్

**- సీసీ కెమెరా దాత రవ్వ నరసింహ**




**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 30:**
గ్రామం ఇంద్ర పాలనగరం ప్రభుత్వపాఠశాలలో ధాత రవ్వ నర్సింహా సహాకారం తో సుమారు 84500/-రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా లను ప్రారంభించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ మెంబెర్ లు వరికుప్పల స్వామి, ప్రధానోపాధ్యాయులు, సింగణబోయిన గణేష్ యాదవ్,సింగణబోయిన శ్రీశైలం, మందడి శ్రీధర్ రెడ్డి , రాజన్న, రమేష్, గర్ధాస్ వెంకటేష్ , పద్మారావ్ , ఈర్లపల్లి మల్లయ్య , ఈర్లపల్లి రమేష్ , చిన్నపాక సురేష్ , బోనగిరి సంజీవ , వెలకుర్తి జానాచారి , బాజ నరేందర్ , మర్రి మహేష్ , సింగణబోయిన మల్లేష్, కాటపల్లి మహేష్, శివగల్ల జ్ఞానేశ్వర్ , నక్క వెంకటేష్ , కంబాలపల్లి శ్రీశైలం రేపాక సత్తయ్య ,పుట్టల సాయికుమార్ , సింగణబోయిన సత్యనారాయణ , నక్క వెంకటేష్ , వెలకుర్తి జానాచారి, తదితరులు పాల్గొన్నారు.

## విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుకులం స్టడీ మెటీరియల్ అందజేత



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 30:**
విశ్రాంత ఉపాధ్యాయులు కీర్తి శేషులు అనుముల అంతయ్య స్మారకార్థం వారి కుమారుడు అనుముల శ్రీనివాస్ విపంచి ఫౌండేషన్ ఆద్వర్యం లో వెల్లంకి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురుకులం ఉచిత స్టడీ మెటీరియల్ ను ఫౌండేషన్ ప్రోగ్రాం కో – ఆర్డినేటర్ నకరేకంటి సతీష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గత సంవత్సరం కూడా వెల్లంకి ప్రాథమిక పాఠశాల లో ఉచిత స్టడీ మెటీరీయల్ వినియోగించుకొని పదమూడు మంది విద్యార్థులు సీట్లు పొందారు అలాగే ఈ సంవత్సరం కూడా అందరూ సీట్లు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభగల పేద విద్యార్థులు ఇట్టి మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న విపంచి ఫౌండేషన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు , ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సోమిరెడ్డి , వెంకటేశం ,సువర్ణ,మాధవి విద్యాకమిటీ ఛైర్మన్ సులోచన,మాజీ ఏం పి టి సి ఎర్రోల్ల సుక్కమ్మ తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ ఎన్ అశోక్ కుమార్, ఎర్రోళ్ల మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు త్వరగా అక్రి డేషన్‌కార్డులు ఇవ్వాలి



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 30:**
జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టియుడబ్ల్యూజెయు కృషి చేస్తుందని, అక్రిడేషన్ కార్డులను జర్నలిస్టులకు త్వరగా ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గుండగోని జయశంకర్, కార్యదర్శి చిరబోయిన మల్లేష్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. చిట్యాల లో జరిగిన చిట్యాల మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యమానికి ఆయన హాజరైనారు. అధ్యక్షుడిగా రేగొండ వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శి గా చెన్నోజు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా అంతటి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి గా బొడిగె విజయ్ కుమార్, కార్యదర్శి మూడ వెంకటాద్రి లచే ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ౹జువీజీఖ నకిరేకల్ అధ్యక్షులు కొల్లోజు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బండారు చందు, కారంపూరి మధు, మారగోని శ్రవణ్, సంతోష్. దేశగాని సాయికుమార్, పల్లపు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరను సందర్శించుకున్న తలసాని

**- అమ్మవార్లకు ఎమ్మెల్యే మొక్కులు**

**ములుగు,జనవరి30( వెలుతురు):**
మేడారంలో సమ్మక్క, సారక్క జాతర వైభవంగా కొనసాగుతుంది. జాతర అమ్మవార్లను దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం మేడారం జాతరను సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క, సారక్కను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బంగారం సమర్పించి అమ్మవార్లను వేడుకున్నారు. జాతరలో మంత్రి సీతక్క ఎమ్మెల్యేను ఆపార్యంగా పలకరించారు. సీతక్క వారికి అమమవారి దర్శనం చేయించారు.

# జనరల్ వార్తలు

## ఆరుట్ల గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ అప్ హోప్ సహకారంతో ఆరుట్ల గ్రామ సర్పంచ్ పాలకమండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**- ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్ష లు చేయించుకున్న గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్, ఉపస ర్పంచ్ నూకం రాజు ముదిరాజ్**



**మంచాల వెలుతురు జనవరి 30:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆప్ హోప్ సహకారంతో ఆరుట్ల గ్రామ సర్పంచ్ పాలకమండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ముందుగా గ్రామ స ర్పంచ్ మానిపాటి శోభా కుమార్ వైద్య పరీక్షలు చేయించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారం భించారు ఈ వైద్య శిబిరానికి గ్రామంలోని వృద్ధులు ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయిం చు కున్నారు అనంతరం వైద్యులు పరీక్షలు చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వైద్య శిబిరాన్ని వినియోగించుకొని వివిధ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మంకు మమత వినోద్ మంద మాధవి మోహన్ రెడ్డి మాడుగుల బాలమణి కృష్ణగౌడ్ లాలగారి మన్నె మ్మ సాతిరి సత్యం వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## సి.ఎస్.ఆర్ ఫండ్స్‌తో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధునీకరణ...

**- ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్**



**కూకట్ పల్లి జనవరి 30 వెలుతురు:**
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. సి.ఎస్.ఆర్ ఫండ్స్ ద్వారా సేల్స్‌ఫోర్స్ సంస్థ వారి సౌజన్యంతో ప్రభాకర్ రెడ్డి నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పూర్తిగా మరమ్మత్తులు చేసి ఆధునీకరించిన అనంతరం పాఠశాల భవన ప్రారంభోత్సవ కార్యక్రమం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ చేతుల మీదుగా బూరుగుపల్లి రామ్మోహన్ ఆధ్వర్యంలో అధికారికంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు అందినప్పుడే నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని ఈ తరహా సి ఎస్ ఆర్ కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ సేల్స్‌ఫోర్స్ సంస్థ సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వడం ప్రశంసనీయమని అన్నారు. పేద,మధ్యతరగతి కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక సౌకర్యాలు కల్పించడమే నిజమైన సామాజిక సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సహాయం చేయండి ట్రాఫిక్ సి ఐ తిమ్మప్ప...

**- గుడ్ సమారిటన్ పథకంపై కూకట్ పల్లి ట్రాఫిక్ పోలీసుల అవగాహన...**




**కూకట్ పల్లి, జనవరి 30 వెలుతురు:**
రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి వెంటనే సహాయం చేసి ప్రాణాలు కాపాడేలా ప్రజలు ముందుకు రావాలని కూకట్ పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తిమ్మప్ప పిలుపునిచ్చారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతంగా గుర్తించిన కూకట్ పల్లి బస్‌స్టాప్ సమీపంలో శుక్రవారం రోడ్డు భద్రతపై ప్రత్యేక ప్రజా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ గుడ్ సమారిటన్ స్కీమ్ గురించి ప్రజలకు వివరించారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి చేర్చిన లేదా తక్షణ సహాయం చేసిన వారికి ప్రభుత్వం రూ.5,000 నగదు బహుమతి అందిస్తుందని తెలిపారు. అంతేకాకుండా సహాయం చేసిన వ్యక్తులకు చట్టపరమైన రక్షణ ఉంటుందని, పోలీస్ కేసులు లేదా కోర్టు హాజరు భయం అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రమాద బాధితులకు "గోల్డెన్ అవర్"లో అందించే సహాయం ప్రాణాలను కాపాడటంలో కీలకమని పేర్కొన్నారు. కేవలం భయంతో లేదా అనవసర అపోహలతో ప్రజలు వెనుకడుగు వేయకుండా, మానవత్వంతో ముందుకు వచ్చి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు, వాహనదారులు పాల్గొని పథకం వివరాలను తెలుసుకున్నారు.

## కొత్తపల్లి 18వ డివిజన్ అభ్యర్థిగా ఉల్లెందుల నరేష్ (రుద్ర) నామినేషన్



**కరీంనగర్ జనవరి 30 వెలుతురు:**
కొత్తపల్లి మున్సిపాలిటీ 18వ డివిజన్ అభ్యర్థిగా ఉల్లెందుల నరేష్ (రుద్ర) నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆయన మద్దతుదారులతో కలిసి ఎన్నికల అధికారుల కార్యాలయానికి చేరుకుని నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ఉల్లెందుల నరేష్ (రుద్ర) మాట్లాడుతూ, 18వ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజలు తనపై నమ్మకం ఉంచి ఆశీర్వదిస్తే డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. నామినేషన్ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బండలేమూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాటోత్ పూర్య నాయక్ మరణం

**- కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు పూర్య నాయక్ కుటుంబానికి 5000 వేలు ఆర్థికసాయం చేసిన బండ లేమూర్ గ్రామమాజీ సర్పంచ్ పతులోత్ మంగ శ్రీనివాస్ నాయక్**



**మంచాల వెలుతురు జనవరి 30:**
మంచాల మండలం బండలేమూర్ గ్రామానికి చెందినకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జాటో త్ పూర్యనాయక్ ఆకస్మికంగా మృతిచెందాడు పూర్యనాయక్ మరణం విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు వారి నివాసానికి వెళ్లి పూర్య నాయక్ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగడ అనుభూతి తెలిపిఆత్మకు శాంతి కలగాలని కోరారుసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూజాటోత్ పూ ర్యా నాయక్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నోసేవలు చేశారు గత సర్పంచ్ ఎంపీ టీసీ ఎలక్షన్స్ లోవారి కుటుం బం కాంగ్రెస్ పార్టీకి ఎన్నోసేవలు అందించడం జరిగింది గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఈస్థాయిలో ఉంది అంటే వారి యొక్క కుటుంబంచేసిన సేవలే అని వారి యొక్క అకాలమరణం కాంగ్రెస్ కపార్టీకి తీరని లోటు అని అన్నారు వారి కుటుంబానికి ఎల్లప్పుడు కాంగ్రెస్ పార్టీ అండగా ఉం టుందని కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు వారి యొక్క అంత్యక్రియల కోసం బండలేమర్ గ్రామమాజీ సర్పంచ్ మంగ శ్రీనివాస్ నాయక్ 5000/రూపాయలు ఆర్థిక సహాయంచేశారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాల ఐలయ్య గ్రామ పంచా యతీ వార్డు సభ్యుడు లొంగారి మల్లేష్ కాంగ్రెస్ సర్పంచ్ కంటె స్టెంట్ అభ్యర్థి జనార్ధన్ కాంగ్రెస్ స్టీ రింగ్ కమిటీ అధ్యక్షులు నవీన్ కుమార్.మాజీ విద్యాకమిటీ చైర్మన్ మునిరాజ్ కాంగ్రెస్ నాయకు లు దేవసోత్ శ్రీనివాస్ మాజీ వార్డు సభ్యుడుదొర్జి కిషన్ నాయక్ రాజ్ కుమార్ బిచ్చుఉదావత్ దే విలాల్ కాంగ్రెస్ సీనియర్ బీసీసెల్ నాయకులు వట్టి నరసింహయాదవ్ పాతులోత్ లక్ష్మణ్ కాం గ్రెస్ నాయకులు ఉదావత్ మురళీకృష్ణ అజీనాతండా కాంగ్రెస్ నాయకులు జరుపుల బోజ్యా నా యక్ కెలోత్ పెంట్యానాయక్ పాతులోత్ మనోహర్ దేవాదాయశాఖ వైస్ చైర్మన్ సంజయ్ క రంటోత్ రాజ్యాకృష్ణ జాటోత్ శ్రీనివాస్ జాటోత్ నవీన్ జాటోత్ రమేష్ జాటోత్ పాండు తదితరులు పాల్గొన్నారు

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్ ఫిబ్రవరి 12 సమ్మెకు సీఐటీయూ పిలుపు



**కూకట్ పల్లి, జనవరి 30 వెలుతురు:**
ఉద్యోగ భద్రతను దెబ్బతీసేలా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలనగర్ పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె నోటీసులు ఇస్తున్న కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను బలహీనపరుస్తాయని ఆరోపించారు. ఉద్యోగ భద్రత లేకుండా, శాశ్వత నియామకాల అవకాశాలు తగ్గిస్తూ, యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కులను పరిమితం చేసే విధంగా ఈ చట్టాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోపిడీ చేసుకునే పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. స్కీం వర్కర్లకు నెలకు కనీసం రూ.18,000 ఫిక్స్ వేతనం ఇవ్వడంతో పాటు, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మిక వ్యతిరేక చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం ముందు నుంచే కార్మికులకు ఉన్న రక్షణాత్మక చట్టాలను తొలగించడం ద్వారా కార్మికులను బలహీన వర్గంగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. అదే విధంగా విద్యుత్ సవరణ చట్టం2025, విత్తనాల సవరణ చట్టం వంటి అంశాలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధుల పంపిణీలో కేంద్రం 60%, రాష్ట్రం 40% భాగస్వామ్యంగా మార్పులు చేయడం వల్ల పథకం బలహీనపడుతుందని పేర్కొన్నారు. దేశంలో కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు కలిసి కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్నారని, ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలకు గట్టి సమాధానం ఇవ్వాల్సిన సమయం వచ్చిందని రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బి. రాములు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)జనవరి 30**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు గాను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పి ఒ లు, ఎపిఒ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ హాజరై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి అధికారి ఎన్నికల నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. పోలింగ్ రోజు ఎదురయ్యే వివిధ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు శిక్షణ లో భాగంగా ఎన్నికల అధికారులకు అవగాహన కల్పిస్తూ మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా ,ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడేందుకు పోలింగ్ ఆఫీసర్ (పిఒ) అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ (APO)**లు కీలక పాత్ర పోషిస్తారని, పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రంలో మొత్తం ప్రక్రియను సజావుగా నిర్వహించడం PO యొక్క ప్రధాన బాధ్యత అని అన్నారు. ఓటింగ్ ప్రారంభానికి ముందు పోలింగ్ సామగ్రి సక్రమంగా ఉందో లేదో పరిశీలించడం, మాక్ పోలింగ్ నిర్వహించడం, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ లు సిద్ధం చేయడం వంటి బాధ్యతలు నిర్వహించాలని, ఓటర్ల గుర్తింపు, ఓటరు జాబితా ప్రకారం ఓటు హక్కు కల్పించడం, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం PO APOల సంయుక్త బాధ్యత. ఎన్నికల సమయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడటం, సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం కూడా వారి విధుల్లో భాగం అని, అలాగే పోలింగ్ ముగిసిన అనంతరం ఓటింగ్ యంత్రాలను సీల్ చేయడం, అవసరమైన పత్రాలను పూర్తిచేసి భద్రంగా స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం వంటి కీలక బాధ్యతలను కూడా పి ఒ/ ఎపిఒలు

## నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)జనవరి 30**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ వార్డు ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని శుక్రవారం ఇంచార్జి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి సందర్శించి పరిశీలించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో గత బుధవారం నుంచి మూడు రోజులుగా నామినేషన్ల స్వీకరణ జరుగుతున్నదని తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ తేదీ 31వ తేదీ కాగా, తదుపరి ఫిబ్రవరి 11న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు అందిన నామినేషన్ల సంఖ్య, నియమించిన ఆపరేటర్ల వివరాలు, అభ్యర్థుల సంఖ్య, FST, SST బృందాల ఏర్పాటు, శిక్షణ తరగతుల నిర్వహణ, వెబ్‌కాస్టింగ్ సదుపాయం, ప్రింటింగ్ ప్రెస్ వివరాలు, బ్యాలెట్ బాక్సుల సరఫరా తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, RDO వీణ,మున్సిపల్ కమిషనర్ రాజేందర్, తహసీల్దార్ జనార్ధన్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 41 వ వార్డు కౌన్సిలర్ గా బి జే పి అభ్యర్థినిగా నామినేషన్ వేసిన నామాల లక్ష్మీ





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)జనవరి 30**
శుక్రవారం ఆఖరి రోజు నాడు బి జే పి అభ్యర్థినిగా 2 వ సెట్టు 41 వ వార్డు నుంచి నామాల లక్ష్మి తన మద్దతు దారులతో నామినేషన్ వేశారు.

## శాంతియుత, నిష్పక్షపాత ఎన్నికలే పోలీస్ శాఖ లక్ష్యం - ఎస్పీ ఎం రాజేష్ చంద్ర



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు)జనవరి 30**
శాంతియుత, నిష్పక్షపాత ఎన్నికలే పోలీస్ శాఖ లక్ష్యం జిల్లా ఎస్పీ ఎం రాజేష్ చంద్ర అన్నారు, శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ఆవరణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ దాఖలు చివరి రోజు నేపథ్యంలో కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు. ఎన్నికల నియమావళి (ఎంసిసి) అమలులో రాజీ లేదు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో, కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర క్షేత్రస్థాయిలో సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. బారికేడ్లు, క్యూ లైన్లు భద్రతా సిబ్బంది మోహరింపును ఆయన స్వయంగా పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉందని తెలిపారు. అభ్యర్థులు మరియు వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎం సి సి ) కచ్చితంగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా రావడం, నినాదాలు చేయడం లేదా ర్యాలీలు నిర్వహించడంపై నిషేధం ఉందని స్పష్టం చేశారు. శాంతిభద్రతల విఘాతానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం వైపు వచ్చే రహదారులపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే ఉంచాలని, ప్రధాన కూడళ్ల వద్ద నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. జిల్లాలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ ఎస్.హెచ్.ఓ నరహరి, కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 30:**
పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూల మాలయేసి నివాళులర్పించినారు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ, వనం చంద్రశేఖర్, సాల్వేర్ అశోక్, బుడ్డ సాలయ్య, గోదాసు శ్రీమన్నారాయణ, అమ్ముద లక్ష్మణ్, కోట సుధాకర్, కొమ్ము రామస్వామి, ఎండి రిజ్వాన్, ఎండి అజార్, చింతల కృష్ణ, గుంటి శీను, ఎండి వహీద్, వెంకట్ రెడ్డి, మోటో నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలలో రాణించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 30**

క్రీడలలో రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్ అన్నారు. శుక్రవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడోత్సవాల ముగింపు, బహుమతుల ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహా గారు షబ్బీర్ అలీ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ట్రోఫీలను అందజేశారు. మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్ బాలికల విభాగం క్రీడాకారులకు తన విరాళంతో ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ పాత రాజు, సర్పంచ్ ఆశ బోయిన అక్షర శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీఓ రవికుమార్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంకర్ రెడ్డి, స్వామి, వివిధ పాఠశాలల పీడీలు అనిల్ కుమార్, సాయి మౌర్య తదితరులు పాల్గొన్నారు.

# లెప్రసీ వ్యాధిపట్ల అపోహలు వద్దు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 30**

శుక్రవారం నాడు మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా లింగంపేట్మండల లోని వండ్రికల్ లెప్రసి కాలనీ గ్రామంలో కుష్టి వ్యాధి వ్యతిరేక దినం సమావేశం నిర్వహించి కుష్టి వ్యాధి ఎలా సోకుతుంది వాటి లక్షణాల గురించి మాట్లాడి జనవరి 30ని కుష్టి వ్యతిరేక దినముగా భావించాలని మహాత్మా గాంధీజీ కుష్టి వ్యాధి నివారణకు చేసిన కృషి వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన వర్ధంతి రోజైన జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు ఈ 15 రోజులు జిల్లా వ్యాప్తంగా ఈ స్పర్శ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్(రాజా) నిర్వహించబడుతుంది అనంతరం కుష్టి వ్యాధి నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేయించినాము కుష్టి వ్యాధి నివారణ పక్షోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలలో సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని సూచించాము మన కామారెడ్డి జిల్లాను కుష్ఠు రహిత జిల్లాగా మార్చాలని చెప్పినాము లెప్రసీ కాలనీలోని రోగులకు దుప్పట్లు సెల్ఫ్ కేర్ కిట్స్ మందులు ఇచ్చినాము ఈ కార్యక్రమంలో పిఓ డాక్టర్ జి ప్రదీప్ కుమార్ డిపిఎమ్ఓ కే జీవన్ ఇన్చార్జ్ డెమో వేణుగోపాల్ ఇన్చార్జి డిపిహెచ్ఎన్ జానా భాయ్ రిటైర్డ్ డిపిఎంఓ లక్ష్మీనారాయణ సర్పంచ్ చందన సెక్రటరీ వెంకట్రామ చారి మరియు లింగంపేట పిహెచ్సి మెడికల్ అండ్ హెల్త్ స్టాప్ తదితరులు పాల్గొన్నారు.

# 8వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నాగేష్ షెట్కార్

**- నామినేషన్ దాఖలు చేసిన పీసీసీ సభ్యులు కె. శ్రీనివాస్**



**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 30 :**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నాగేష్ షెట్కార్ తరపున పీసీసీ సభ్యులు కె. శ్రీనివాస్ శుక్రవారం నామినేషన్ పత్రాలను అధికారికంగా దాఖలు చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారిని కలసి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, 8వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారానికి నాగేష్ షెట్కార్ కట్టుబడి పనిచేస్తారని, ప్రజల మద్దతుతో ఘన విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. నామినేషన్ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 13వ వార్డు ఏఐఎంఐఎం అభ్యర్థిగా హబీబ్ అబ్దుల్లా నామినేషన్

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 30 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మున్సిపాలిటీ 13వ వార్డు నుండి ఆల్ ఇండియా మజ్లిస్ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ అభ్యర్థిగా హబీబ్ అబ్దుల్లా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆయన మద్దతుదారులతో కలిసి ఎన్నికల అధికారుల కార్యాలయానికి చేరుకుని నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా షేక్ ఫయాజ్ మాట్లాడుతూ, 13వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజలు తనపై నమ్మకం ఉంచి ఆశీర్వదిస్తే వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. నామినేషన్ కార్యక్రమంలో ఏఐఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి మోహీద్ పటేల్ నామినేషన్ దాఖలు

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 30 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మున్సిపాలిటీ 12వ వార్డు నుంచి ఎంఐఎం పార్టీ అభ్యర్థిగా, నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షుడు, న్యాయవాది మోహీద్ పటేల్ తన నామినేషను దాఖలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గతంలోనూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేశానని ఆయన తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తనను 12వ వార్డు కౌన్సిలర్గా గెలిపిస్తే వార్డు మరియు మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని, 12వ వార్డు అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు తనను ఆశీర్వదించి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# బీఆర్ఎస్‌కు మరో షాక్...

**- బీజేపీలో చేరిన బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్**

**- 35వ వార్డు కార్పొరేటర్ సాధవేని శ్రీనివాస్, బండి ప్రశాంత్ లను బీజేపీలోకి ఆహ్వానించిన కేంద్ర మంత్రి**

**- బీఆర్ఎస్ కు చెందిన పలువురు నేతలు బీజేపీలో చేరిక**



**కరీంనగర్ వెలుతురు జనవరి 30:**

బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్. బీఆర్ఎస్ సీనియర్ నేత, 35వ వార్డు కార్పొరేటర్ సాధవేని శ్రీనివాస్ బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనతోపాటు కరీంనగర్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బండి ప్రశాంత్ సైతం కాషాయ కండువా కప్పుకున్నారు. కొద్దిసేపటి క్రితం తమ అనుచరులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిశారు. సంజయ్ సమక్షంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు కోమాల అంజనేయులు వారికి కాషాయ కండువా కప్పి బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించారు. కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ఓదెలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధి కోసం నయాపైసా తీసుకురాలేదంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చుతూ కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి కేంద్రం తెచ్చిన నిధుల వివరాలను వెల్లడించారు. కేంద్రం నుండి దాదాపు 1500 కోట్ల రూపాయలకు పైగా నిధులు తెచ్చి కరీంనగర్ ను అభివృద్ధి చేశానని తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ కళ్లుండి చూడలేని కబోధులు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలని మండిపడ్డారు. ఎలక్షన్స్ సమయంలో తప్ప కరీంనగర్ ముఖం చూడని నాయకులు తనపై ఆరోపణలు చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ ప్రజల పక్షాన నేను చేసిన పోరాటాలు, కేంద్రం నుండి ఎన్ని నిధులు తెచ్చానో, ఏయే ప్రాజెక్టులు, పథకాలు తీసుకొచ్చానే ప్రజలకు తెలుసనని పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు మున్సిపాలిటీల్లో మీ కళ్ల ముందు కన్పిస్తున్న ప్రతి పని, జరిగిన అభివృద్ధి కేంద్రం ఇచ్చిన నిధులతోనే జరిగిందనేది ముమ్మాటికీ నిజం. ఎన్నికల ప్రచారంలో పూర్తి వివరాలతో ప్రజలకు ముందుకు వెళతానని స్పష్టం చేశారు.

# చైన్ స్నాచింగ్ కేసును ఛేధించిన జహీరాబాద్ పోలీసులు

**- ఇద్దరు నిందితులు అరెస్ట్..రూ.4.70 లక్షల బంగారం, ద్విచక్ర వాహనం స్వాధీనం...**





**జహీరాబాద్ వెలుతురు జనవరి 30:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మహిళ మెడలోని పుస్తెల తాడు దోపిడీకి పాల్పడిన కేసును జహీరాబాద్ టౌన్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దోచుకున్న బంగారం, దోపిడీకి ఉపయోగించిన కత్తులు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ సైదా నాయక్ వెల్లడించారు. ఈ నెల 22న జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శ్ నగర్‌లో ఓ మహిళను కత్తితో బెదిరించి మెడలోని బంగారు గొలుసును దోచుకుని నిందితులు పరారైనట్లు తెలిపారు. శుక్రవారం రోజున అల్గోల్ రోడ్డులోని మెహఫిల్ హోటల్ సమీపంలో పోలీసులు సాధారణ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో, పల్సర్ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి బీదర్ వైపు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించారని తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, పుస్తెల తాడు దోపిడీకి పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పటాన్ చెరువుకు చెందిన సయ్యద్ అయ్యాజ్, ఎండీ నిజామ్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు రూ.4 లక్షల 70 వేల విలువైన రెండున్నర తులాల బంగారు గొలుసుతో పాటు, దోపిడీకి ఉపయోగించిన పల్సర్ బైక్‌ను, రెండు కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో సీసీటీవీ ఫుటేజ్ కీలక పాత్ర పోషించిందని డీఎస్పీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన టౌన్ సీఐ శివలింగం, టౌన్ ఎస్ఐ వినయ్ కుమార్‌తో పాటు ఐడీ పార్టీ సిబ్బంది కానిస్టేబుల్స్ ఓందేవ్, అస్లం, పృథ్వి, హరినేత్ర, ఆనంద్‌లను డీఎస్పీ అభినందించారు. వీరిని రివార్డు రూల్‌కు పంపినట్లు తెలిపారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

**- పార్టీ జెండాలు, ర్యాలీలు, డప్పులతో ఊరేగింపు....**

**- పోలీసుల పటిష్ట బందోబస్తుతో పరిస్థితుల పర్యవేక్షణ...**






**జహీరాబాద్ వెలుతురు జనవరి 30:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఆరేళ్ల తర్వాత పెద్ద ఉత్సాహంతో ప్రారంభమై, చివరి రోజున కోలాహలంగా కొనసాగింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, వామపక్ష పార్టీలు, ఆమ్ ఆద్మీ, టిఆర్పీ మరియు ఇతర పార్టీల అనేక అభ్యర్థులు నామినేషన్ సమర్పించేందుకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అభ్యర్థుల డప్పుల ఊరేగింపులు, పార్టీ జెండాలతో మద్దతుదారుల ర్యాలీలు ఊరంతా వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చాయి. స్థానిక అధికారులు, పోలీసులు, ఎన్నికల సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ర్యాలీలు, వాహనాల సజావుగా గమనాన్ని పర్యవేక్షించారు. చివరి నిమిషానికి చేరుకున్న అభ్యర్థుల నామినేషన్లు సజావుగా స్వీకరించబడ్డాయి. నిర్ణీత సమయం ముగిసిన తర్వాత మున్సిపల్ అధికారులు గేటుకు తాళం వేసి, గేటులోకి కొత్తగా వచ్చే అభ్యర్థుల ప్రవేశాన్ని నిలిపివేశారు. అయితే, అప్పటికే గేటు లోపల ఉన్న అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించబడతాయని ఎన్నికల అధికారులు వెల్లడించారు. చివరి రోజు కావడంతో అభ్యర్థులు, వారి అనుచరులు భారీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు.

# 4వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**- కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సవిత్రమ్మ...**

**జహీరాబాద్ వెలుతురు జనవరి 30:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డును సమూలంగా అభివృద్ధి చేసి పట్టణంలోనే ఆదర్శ వార్డుగా నిలబెట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజి ఎంపిటిసి అల్గోల్ సవిత్రమ్మ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కృతజ్ఞతగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం అందించాలని ఆమె పిలుపునిచ్చారు. శుక్రవారం జహీరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో 4వ వార్డు రాంజోల్ నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా సవిత్రమ్మ తన నామినేషన్ ఫారాన్ని దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల మౌలిక అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు వంటి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి గల్లీ, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి కుమార్ మాట్లాడుతూ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని అన్నారు. ఇప్పటివరకు ఒక్క హామీని కూడా విస్మరించలేదని, మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్థానిక ఎంపీ సురేశ్ షెట్కార్, జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డా. చంద్రశేఖర్ నాయకత్వంలో 4వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మవుర్ మల్లన్న, అల్గోల్ మల్లన్న, చౌల సంజీవ్ రెడ్డి, పిట్టల రవీందర్, మునిపల్లి రచన్న, మవుర్ వెంకట్, శ్రీశైలం, నర్సింలు, ఉమాకాంత్, సిద్ధు, చంద్రకళ, భాగ్యమ్మ, శ్రావణి, అనుషమ్మ, రాధిక, హరిణి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంచగామా శివారులో రూ.70 లక్షలు గంజాయి స్వాధీనం





**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 30 :**

నారాయణఖేడ్ మండల పరిధిలోని పంచగామ శివారులో ఆవుటి నాగయ్య వ్యవసాయ పొలంలో గంజాయి మొక్కలను అంతర పండగ సాగు చేస్తున్నాడని పక్క సమాచారంతో డిస్టిక్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది శుక్రవారం అకస్మిక దాడులు చేశారు. దీంతో 600 గంజాయి మొక్కలు 17.741 కేజీల ఎండు గంజాయి, 0.897 కేజీల గంజాయి మరియు 30 వేల నగదు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని నిందితుని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు డిస్టిక్ టాస్క్ ఫోర్స్ సీఐ శంకర్ తెలిపారు. ఈ దాడులలో ఎస్సై జి.హనుమంతు,డి. అనుదీప్, కానిస్టేబుళ్లు అంజిరెడ్డి అరుణ జ్యోతి రాజేష్ శివకాంత్ ఉన్నారు.

## తెలంగాణలో ఏమీ సాధించుకోలేక పోయాం

**- సమ్మక్క జాతరలో కవిత ఆవేదన**

ములుగు,జనవరి30( **వెలుతురు**):

తెలంగాణ ఏర్పడిన తర్వాత 12 ఏండ్లలో ఏమీ సాధించుకోలేక పోయామని మాజీ ఎమ్మెల్సీ,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో వేటిని కూడా సంపూర్ణంగా సాధించుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మను ఆమె దర్శించుకున్నారు. అంతకు ముందు గట్టమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిలువెత్తు బంగారాన్ని అందించి మొక్కులు తీర్చుకున్నా రు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అమ్మవార్ల వారి జాతి కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని చెప్పారు. ఇవాళ తెలంగాణ జాతి కోసం అందరం నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. మన హక్కులను సాధించుకునేందుకు సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# జహీరాబాద్‌కోహిర్ మున్సిపాలిటీలకు ఇంకా ఎవరూ ఖరారు కాలేదు

**- సోషల్ మీడియా ప్రచారాలు అవాస్తవం...**

**- ప్రచారాలను ఖండించిన మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్...**

**జహీరాబాద్ వెలుతురు జనవరి 30:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా జరుగుతున్న ప్రచారాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంస్థలు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక అధికారిక ప్రకటన విడుదల చేసి పలు కీలక అంశాలపై స్పష్టతనిచ్చారు. జహీరాబాద్ మరియు కోహిర్ మున్సిపాలిటీలకు సంబంధించి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభ్యర్థులను ఖరారు చేయలేదని మంత్రి స్పష్టం చేశారు. ఎవరికీ బీఫారాలు లేదా పార్టీ తరఫున అధికారిక అనుమతులు ఇవ్వలేదని వెల్లడించారు. పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించే అధికారం పార్టీ ఇంచార్జ్ మంత్రి, పీసీసీ అధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు లేదా పీసీసీ ద్వారా ప్రత్యేకంగా అధికారం పొందిన వ్యక్తులకు మాత్రమే ఉంటుందని ఆయన వివరించారు. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలుగా కొన్ని వ్యక్తులు లేదా సంస్థలు అనధికారికంగా అభ్యర్థుల పేర్లను ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని, వాటికి ఎలాంటి ప్రాతిపదిక లేదని మంత్రి అజారుద్దీన్ తేల్చిచెప్పారు. అటువంటి ప్రచారాలను ప్రజలు, పార్టీ కార్యకర్తలు నమ్మవద్దని ఆయన సూచించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే పార్టీ అధికారిక వర్గాల ద్వారా అభ్యర్థుల జాబితా వెల్లడించబడుతుందని తెలిపారు. అప్పటివరకు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ఓపికతో వేచి ఉండాలని మంత్రి కోరారు. అనధికారిక ప్రకటనలు, పుకార్ల వల్ల పార్టీ శ్రేణుల్లో గందరగోళం ఏర్పడకుండా అందరూ జాగ్రత్త వహించాలని ఆయన ఈ ప్రకటన ద్వారా స్పష్టంగా తెలియజేశారు.

# గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఈడీ ఛార్జిషీట్..



**హైదరాబాద్, జనవరి 30( వెలుతురు):**
గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఈడీ దూకుడు పెంచింది. రూ. 11.30 కోట్ల విలువైన 35 ఆస్తులు.. నయీం అక్రమంగా సంపాదించినట్లు ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ ఆస్తులను అతడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా నయీం అక్రమాస్తుల విషయంలో పోలీసు, రాజకీయ సంబంధాలపై కూడా ఈడీ ఆరా తీస్తోంది. 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో నయీం హతం అయ్యాడు. గ్యాంగ్‌స్టర్ నయీం 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడికి సంబంధించిన అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేగం పెంచింది. నయీంపై జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు జరిపింది. తాజాగా నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిశీలించిన కోర్టు విచారణకు అంగీకరించింది. కాగా, గ్యాంగ్‌స్టర్ నయీం.. తన గ్యాంగ్ సభ్యులతో కలిసి దాదాపు రూ. 11. 30 కోట్ల విలువైన 35 ఆస్తులను అక్రమంగా సంపాదించినట్లు ఈడీ ఛార్జిషీటులో పేర్కొంది.కాగా, నయీంకు సంబంధించిన అక్రమాస్తులపై ఈడీ 10 మందిపై అభియోగాలు మోపింది. ఛార్జిషీట్ ప్రకారం.. నయీం యాదాద్రి భువనగిరి జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. ఈ ఆస్తులన్నీ నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లుగా ఈడీ అధికారులు గుర్తించారు. కాగా, నయీం అక్రమాస్తుల కేసులో అతడి భార్య హసీనా బేగంతో పాటు పలువురు కుటుంబ సభ్యుల పేర్లను ఈడీ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. అయితే ఈడీ ఆరోపిస్తున్న అక్రమాస్తులకు సంబంధిచి కొన్నిసార్లు నోటీసులు జారీ చేసినా.. స్పందించకపోవడం, ఐటీఆర్ పత్రాలు చూపించకపోవడంతో కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.మరోవైపు, నయీంకు ఉన్న పోలీసులు, పొలిటికల్ సంబంధాలపై కూడా ఈడీ కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎక్కడికి వెళ్లింది.. ఇందులో అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఏమైనా ఉందా అనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ కేసులో త్వరలో నిందితులకు కోర్టు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.తెలుగు రాష్ట్రాల్లో అండర్ వరల్డ్ డాన్‌గా పేరున్న నయీం 2016 ఆగస్టు 8న ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. భూ సెటిల్‌మెంట్లు, చేస్తూ తనకంటూ ఓ గ్యాంగ్ ను మెయింటెన్ చేస్తూ ప్రభుత్వాలను ముచ్చెమటలు పట్టించాడు. దీంతో ఇతడి అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో నందిగామ గ్రామంలోని మిలీనియం టౌన్ షిప్ లోని ఓ వ్యక్తి ఇంట్లో ఉంటూ స్థానిక భూదందాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అనంతరం వారున్న స్థలానికి వెళ్లగా.. పోలీసులకు నయీం అనుచరులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో నయీం మృతి చెందాడు.ఐపీఎస్ వ్యాస్, మావోయిస్టు సాంబశివుడి వంటి వారి హత్య కేసులో నయీం ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కాగా, నయీం మృతితో బాధితులంతా బయటకు వచ్చి ఫిర్యాదులు చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసు విచారణకు సిట్ ఏర్పాటు చేసింది. నయీంపై దాదాపు 250 కేసులు నమోదు చేయగా మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ రంగంలో దిగి దర్యాప్తు చేపట్టింది.

# మేడారంలో భగ్గుంటున్న ధరలు



**వరంగల్, జనవరి 30( వెలుతురు):**
మేడారం జాతర ప్రారంభమైంది. వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, జాతర నేపథ్యంలో కొబ్బరికాయల నుంచి కోళ్లు, మేకల ధరలు, ఇళ్ల అద్దెల వరకు అన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. స్థానికులు ఇళ్లలో కనీస వసతులు లేకున్నా అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేయడం గమనార్హం. ఈ మూడు రోజులు ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. పెరిగిన ధరలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ప్రారంభమైంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న వనదేవతల జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ 4 వేల బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.దిలా ఉంటే జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొబ్బరికాయ మొదలు అమ్మలకు సమర్పించే బంగారం (బెల్లం), కోళ్లు, మేకల ధరలతో పాటు, ఇళ్లు, ప్రత్యేక గదుల అద్దెలను భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారు. ఆఖరికి చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేస్తున్నారంటే జాతరలో దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.మేడారం జాతరలో భాగంగా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి బంగారం (బెల్లం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పిస్తారు. ఇదే అదునుగా మేడారం జాతర వద్ద కోళ్లు, మేకల ధరలను భారీగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వెంట తీసుకురాలేక, జాతరకు వచ్చాక అక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు.మేకపోతు లైవ్ కిలో రూ. 420 ఉండగా, మేడారంలో మాత్రం రూ. 900 నుంచి రూ. 1000 వరకు అమ్ముతున్నారు. మటన్ ధర రూ. 1500 వరకు పలుకుతోంది. బయట రూ. 170-180 కి దొరికే కిలో కోడిని జాతర దగ్గర రూ. 300-350 వరకు అమ్ముతున్నారు. మొన్నటి వరకు కూడా కిలో రూ. 350-400 ఉన్న నాటుకోడిని ఇప్పుడు రూ. 700లకు అమ్ముతున్నారు. జాతర చివరి మూడు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఇళ్ల అద్దెలు కూడా భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. కనీస వసతి సౌకర్యాలు లేకపోయినా సరే అద్దెలు ఆకాశాన్నంటాయి. ఆఖరికి చెట్ల నీడలో సేదతీరడానికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఉండటానికి ఇళ్లు వెతుకుతుండటంతో స్థానికులు భారీ మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫ్యాన్ తప్ప మరే ఇతర సౌకర్యాలు లేని గదులకు కూడా రోజుకు రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.గదులు దొరకని వారు చెట్ల నీడలో సేదతీరడానికి ప్రయత్నిస్తుండగా, తోట యజమానులు వాటికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. జాతరకు దగ్గరలో తోటలున్న స్థానికులు భక్తులకు చెట్లను అద్దెకు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు.

# కమలానికి మున్సిపల్ పరీక్ష

**హైదరాబాద్, జనవరి 30( వెలుతురు):**
ఈసారి పురపోరు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారనుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అంతంత మాత్రంగానే సీట్లు దక్కించుకున్న బీజేపీకి ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష కానున్నాయి. అధికారంలోని కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే కమలం పార్టీ ఇప్పు డు ఆశలన్నీ మున్సిపల్‌పైనే పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలంటే ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ గెలవాల్సిన పరిస్థితి. ఈ ఫలితాలను బట్టే ప్రజల్లోకి పాజిటివ్ సంకేతాలు వెళ్తాయి.మొదటి నుంచి తమకు అర్బ న్ (పట్టణ) ప్రాంతాల్లోనే బలం ఉందని చెప్పుకుంటున్న బీజేపీ ఈ ఎన్నికల్లో అత్యధికంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, వార్డులను కైవసం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ నాయకులకు ఇన్‌చార్జీలు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే జాతీయ నాయకత్వం ముగ్గురు ఎన్నికల ఇన్‌చార్జీలు, కో ఇన్‌చార్జీలను నియమించగా త్వర లోనే జాతీయ అధ్యక్షుడితోపాటు పలువురు జాతీయ నాయకులకు ఏకంగా రంగంలోకి దింపబోతోందిరాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు, 2,996 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ ప్రక్రియకు రేపటితో ఆఖరు గడువు. అయితే గత మున్సిపల్ ఎన్నికల్లో 322 కౌన్సిలర్లు, కార్పొరేటర్లను బీజేపీ గెలుచుకుంది. వీటితోపాటు ఐదు మున్సిపల్ చైర్మన్లను బీజేపీ తమ ఖాతాలో వేసుకుంది. మొన్న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 5000 మందిని బరిలోకి దింపి 800 నుంచి 1000 వరకు పంచాయతీలను గెలుచుకుంది.గ్రామీణంలో తమకు పెద్దగా బలం లేదని, పట్టణమే తమ బలమని కమలం పార్టీ ముందు నుంచి అంటోంది. ప్రజల్లోనూ బీజేపీ అంటే అర్బన్ పార్టీ అనే ముద్రనే ఉంది. ఇప్పుడిదే బీజేపీకి అగ్నిపరీక్షగా మారింది.

మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. రాజకీయ పార్టీల గుర్తుల మీద ఈ ఎన్నికలు జరుగనుండటంతో పురపోరులో ఏ పార్టీ బలమెంతో స్పష్టమవుతుంది. తమకున్న పేరును నిలుపుకోవాలన్నా...వచ్చే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలన్నా ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయబావుటా ఎగురవేయాల్సిందే.ఇందులో భాగంగానే బీజేపీ ఈసారి పెద్ద టార్గెట్‌ను పెట్టుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో 50 నుంచి 60 శాతం వరకు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏడు కార్పొరేషన్లలో నాలుగు నుంచి ఐదు వరకు గెలుచుకునేలా వ్యూహాలను అమలు చేస్తోంది. వీటితోపాటు పార్టీ తన ఉనికిని చాటుకునేలా ఎక్కువ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలుచుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో వారం రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు భేటీ అయ్యారు. ఢిల్లీ నుంచి ఆయన వచ్చిన వెంటనే అత్యవసరంగా పార్టీ పదాధికారుల మీటింగ్ నిర్వహించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ నాయకత్వం ఇప్పటికే ముగ్గురిని రంగంలోకి దింపిందని, వారికి మున్సిల్ ఎన్నికల ఇన్‌చార్జులుగా నియమిస్తూ.. మహారాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్‌కు, కోఇన్‌చార్జీలుగా రేఖా శర్మ, అశోక్‌కు బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారువీరు ముఖ్యనాయకులతో వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆయా జిల్లాలు, నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల టాస్క్‌లను అప్పగించారు. వీటికితోడూ ఇప్పటికే జిల్లా, మున్సిపాలిటీల వారీగా మరికొంత మంది రాష్ట్ర నేతలను ఇన్‌చార్జీలుగా రాష్ట్ర నాయకత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఫిబ్రవరి 7, 9వ తేదీల్లో వీటిని నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సభలను ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణలో నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత ఐదు సభలను నిర్వహించాలని అనుకున్న పార్టీ నేతలు దాన్ని రెండుకు కుదించినట్లుగా తెలిసింది. ఈ సభల ద్వారా ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ జాతీయ స్థాయి దిగ్గజాలను రంగంలోకి దించుతోంది.పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాతో పాటు కీలక నేత అమిత్‌షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉండడంతో ఎన్ని సభలు నిర్వహిస్తారో...ఎంత మంది నేతలు వస్తారనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కమలనాథులకు ఈ పురపోరు ఎన్నికలు మాత్రం పరీక్షే అని చెప్పాలి.

# 'సింహం' గుర్తుపై జాగృతి అభ్యర్థుల పోటీ

**హైదరాబాద్, జనవరి 30( వెలుతురు):**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కలిసి పోటీ చేయనున్నాయి. జాగృతి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ 'సింహం' గుర్తుపై పోటీ చేయనున్నారు. ఇక తొలిరోజు 902 నామినేషన్లు దాఖలు కాగా.. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయాలు హీటెక్కాయి. ప్రధాన పార్టీలతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతుదారులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి పోటీ చేసేందుకు రెడీ అయ్యారు.ఈ మేరకు జాగృతి అధ్యక్షురాలు కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకత్వం మధ్య జరిగిన కీలక చర్చలు ఫలించాయి. రానున్న పురపాలక ఎన్నికల్లో తెలంగాణ జాగృతికి చెందిన ఔత్సాహిక అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించారు. కేవలం ఈ ఎన్నికలకే పరిమితం కాకుండా.. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలని ఇరు పక్షాలు అంగీకారానికి వచ్చాయి. హైదరాబాద్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం, కొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలికింది.ఇక బుధవారం నామినేషన్ల స్వీకరణ మొదటి రోజే అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 2,996 వార్డులకు గాను తొలిరోజే 902 నామినేషన్లు దాఖలయ్యాయి. 890 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా.. కొందరు అభ్యర్థులు రెండేసి సెట్ల నామపత్రాలను సమర్పించారు. క్షేత్రస్థాయిలో తమ పట్టు నిరూపించుకునేందుకు అభ్యర్థులు ఉత్సాహం చూపుతున్నారు. మొదటి రోజు నామినేషన్ల పర్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 382 నామినేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ 258 నామినేషన్లతో




రెండవ స్థానంలో ఉండగా, బీజేపీ నుంచి 169 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.నామినేషన్ల స్వీకరణకు శుక్రవారమే ఆఖరి గడువు కావడంతో.. నేడు, రేపు అభ్యర్థుల తాకిడి భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదనపు సిబ్బందితో ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. కాగా.. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనున్నాయి.

తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది.

ఈ పరిణామం ముఖ్యమైంది ఎందుకంటే తెలంగాణ జాగృతి సాధారణంగా సాంస్కృతిక, సామాజిక సంస్థగా పిలుస్తున్నా, ఇప్పుడు నేరుగా ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా తన రాజకీయ బలాన్ని ప్రదర్శించాలని చూస్తోంది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన "సింహం" చిహ్నం ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు పరిచయమైందని, జాగృతి కార్మికుల చేరిక దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందని కవిత భావిస్తున్నారు. ఈ ఒప్పందం తెలంగాణ స్థానిక రాజకీయాల్లో కొత్త ఎత్తుగడకు కారణమవుతుందని అంటున్నారు. ఈ మధ్య కవిత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీ ఏర్పాటు, విధి విధాలు, ప్రచార వ్యూహాలపై లోతుగా చర్చించారు. ఆ పనులు ఒకవైపు సాగుతుండగానే మరోవైపు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి అసలైన బలాన్ని అంచనా వేసుకోవాలని కవిత భావిస్తున్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

# యూటర్న్‌లో దానం...?

**హైదరాబాద్, జనవరి 30( వెలుతురు):**
తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలలో ఏడుగురికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయం తేల్చాల్సి ఉంది. ఫిరాయింపులపై ఇదే లాస్ట్ ఛాన్స్ అని సుప్రీం కోర్టు ఇప్పటికే డెడ్‌లైన్ విధించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఈ ముగ్గురి లెక్క తేల్చే పనిలో పడ్డారు స్పీకర్.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ ఈసారి కఠినమైన నోటీసుల జారీ చేశారు. ఏది ఏమైనా ఈనెల 30లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. పార్టీ ఫిరాయింపులపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. లేదంటే పార్టీ ఫిరాయించినట్లుగానే పరిగణించాల్సి ఉంటుందని పరోక్షంగా చెప్పారు. తాజా నోటీసులు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.స్పీకర్ తీర్మానం ప్రకారం, దానం నాగేందర్‌ను ఈ నెల 30 తేదీన విచారణకు కట్టుబడి హాజరు కావాలి. లేదంటే ఇది సభా నియమాల ఉల్లంఘనలకు సంబంధించిన చర్యగా కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే దానం నాగేందర్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పైచేయి సాధించింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ సాధిస్తామన్న ధీమాతో ఉంది. ఆ నమ్మకంతోనే దానంతో రాజీనామా చేయించే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తరహాలో దానంతో కాంగ్రెస్ టికెట్‌పై మళ్లీ పోటీ చేయించాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచాం.ఇక దానం విచారణకు వస్తే అడ్డంగా దొరికిపోతారు. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం.. లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేకుండానే కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఒక పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ మరో పార్టీ టికెట్‌పై పోటీ చేదయడం పార్టీ ఫిరాయింపు కిందకే వస్తుంది. దీంతో విచారణలో



తాను బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పి తప్పించుకునే అవకాశం లేదు.సుప్రీం కోర్టు డెడ్‌లైన్ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ అధిష్టానం అన్నింటికి సిద్దపడ్డట్లు తెలుస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీని వీడలేదని వాదించడం ద్వారా అనర్హత వేటు పడకుండా చట్టపరమైన లొసుగులను వెతుక్కున్నట్లుగా కనిపిస్తోంది. దానం నాగేందర్ తన వివరణలో వినిపించిన అత్యంత కీలకమైన వాదన ఆయన వ్యక్తిగత హోదా . 2024 మార్చిలో తాను కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరైన మాట వాస్తవమేనని అంగీకరిస్తూనే, అది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, దానిని పార్టీ మార్పిడిగా పరిగణించలేమని ఆయన సమర్థించుకున్నారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావించడం సరికాదని, చట్టపరంగా తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని ఆయన వాదిస్తున్నారు. పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు కూడా ఎలాంటి సమాచారం లేదని చెప్పడం ద్వారా, బంతిని మళ్ళీ బీఆర్ఎస్, స్పీకర్ కోర్టులోకి నెట్టారు. అయితే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న దృశ్యాలు, కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుండి లోక్‌సభకు పోటీ చేసిన రికార్డులు కళ్లముందే ఉన్నాయని బీఆర్ఎస్ నేతలంటున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడం అనే నిబంధన దానంకు స్పష్టంగా వర్తిస్తుందని, ఎంపీగా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడమే దానికి అతిపెద్ద నిదర్శనమని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఈ పరిస్థితుల్లో దానం చేసిన వ్యక్తిగత హోదా వాదన కేవలం కాలయాపన చేసేందుకు ఆడుతున్న నాటకమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మొదట దానంపై అనర్హత వేటు వేయకుండానే రాజీనామా చేయించే ఆలోచనలో ఉంది. స్పీకర్ నోటీసుల నేపథ్యంలో దానం రేపో మాపో రాజీనామా చేసే అవకాశం ఉంది. దీంతో మరో ఆరు నెలల్లో ఖైరతాబాద్‌కు ఉప ఎన్నికలు రానున్నాయి. ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఈటెల కేసీఆర్ కు దగ్గరవుతున్నారా



**హైదరాబాద్, జనవరి 30( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో ఈటల రాజేందర్ ఒక ప్రత్యేకమైన శైలి కలిగిన నేత. ఉద్యమ కాలం నుండి కేసీఆర్ వెన్నంటి ఉండి, ఆ తర్వాత అత్యంత నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) నుండి బయటకు వచ్చి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన తర్వాత కూడా ఆయన ప్రతి అడుగు ఆసక్తికరంగానే ఉంటోంది. తాజాగా నేరేడ్‌మెట్ అభివృద్ధి పనుల వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఈటల రాజేందర్ దాదాపు రెండు దశాబ్దాల పాటు కేసీఆర్ నాయకత్వంలో పనిచేశారు. రాజకీయాల్లో 'బాస్' అనే పదం ఒక నేత పట్ల ఉండే విధేయతకు గుర్తు. బీజేపీలో చేరిన తర్వాత కూడా కేసీఆర్‌ను 'బాస్' అని సంబోధించడం అనేది ఈటల మనసులో ఇంకా ఆ పాత జ్ఞాపకాలు ఉన్నాయని సూచిస్తోందా? లేదా బహిరంగ సభల్లో ప్రసంగించేటప్పుడు యాదృచ్ఛికంగా వచ్చిన మాటనా అనేది చర్చనీయం. అయితే, ఆయన మాట విన్న వెంటనే సభలో 'జై కేసీఆర్' నినాదాలు రావడం గమనార్హం. ఆయన మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్తారా అనే ప్రచారమూ సాగుతోంది. మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గ పరిధిలోని మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంది. ఎంపీగా గెలిచిన ఈటల, ఇప్పుడు కేసీఆర్ పట్ల సానుకూల వ్యాఖ్యలు చేయడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌ను, ఓటర్లను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారా? అనే అనుమానాలు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటంలో విపక్షాలన్నీ ఏకం కావాలనే సంకేతం కూడా ఇందులో ఉండవచ్చు. నాకు కులం, మతం లేదు.. ప్రజలే నా బలం" అని ఈటల పేర్కొనడం ద్వారా తాను ఏ పార్టీలో ఉన్నా తనకంటూ ఒక సొంత ఇమేజ్ ఉందని ఆయన చాటిచెప్పారు. తన తల్లిదండ్రుల వారసత్వంతో కాకుండా సొంతంగా ఎదిగానని చెప్పడం ద్వారా అటు కేసీఆర్ కుటుంబ పాలనను, ఇటు వారసత్వ రాజకీయాలను ఆయన పరోక్షంగా విమర్శిస్తూనే, మరోవైపు కేసీఆర్ మార్కు రాజకీయాలను గౌరవిస్తున్నట్లు కనిపిస్తోంది. రాజకీయ వ్యాఖ్యలు పక్కన పెడితే, నేరేడ్‌మెట్ ఆర్‌యూబీ (ఖీజః), ఎల్‌హెచ్‌ఎస్ (ఒఊూ) పనుల కోసం రూ. 80 కోట్లు మంజూరు చేయించడం ఈటల పనితీరుకు నిదర్శనం. ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న మల్కాజిగిరి ప్రజలకు ఇది పెద్ద ఉపశమనం. కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో తాను సఫలమయ్యానని నిరూపించుకోవడం ద్వారా తన పదవికి న్యాయం చేస్తున్నానని ఆయన చాటుకున్నారు. ఈటల రాజేందర్ వ్యాఖ్యలు బీజేపీలో కలకలం రేపవచ్చు, కానీ క్షేత్రస్థాయిలో ఆయన తన పట్టును నిలుపుకోవడానికి అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. "బాస్" వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# జంపింగ్ జంపాంగ్ లు

**కరీంనగర్, జనవరి 30( వెలుతురు):**
ఎన్నికలు వచ్చాయంటే చాలు జంపింగ్ జపాంగ్ ఘటనలు పెరిగిపోతుంటాయి. పార్టీ తనకు సీటు ఇవ్వలేదని, మరో పార్టీ కండువా కప్పుకుంటారు. అక్కడ చేదు అనుభవం ఎదురైతే, మరో పార్టీలోకి లేక నేతల బుజ్జగింపులతో తిరిగి సొంతపార్టీలోకి తిరిగి వస్తుంటారు. తెలంగాణ పురపాలక ఎన్నికల సమయంలో జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇలాంటి సీన్ రిపీట్ అయింది. కౌన్సిలర్ టికెట్ కోసం ఒక నాయకుడు ఉదయం ఒక పార్టీలో చేరి, రాత్రికి మరో పార్టీ గూటికి చేరుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కోరుట్ల పట్టణంలోని 8వ వార్డు నుంచి పోటీ చేసేందుకు తోట గంగాధర్ అనే నాయకుడు కొద్ది రోజులుగా కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదే వార్డు నుంచి పార్టీ తరపున మరొకరు ప్రయత్నిస్తుండటం, తనకు టికెట్ హామీ రాకపోవడంతో ఉదయం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, గంగాధర్ ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనకు, ఆయన మద్దతుదారులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తోట గంగాధర్‌తో మాజీ కౌన్సిలర్ హమీద్, 20 మంది యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ విషయం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు తెలియడంతో వారు వెంటనే అప్రమత్తమయ్యారు. రాత్రికి తోట గంగాధర్‌ను మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు పిలిపించి చర్చలు జరిపారు. చివరకు 8వ వార్డు అభ్యర్థిగా గంగాధర్‌ను ప్రకటిస్తూ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆయనకు కండువా కప్పి తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు. సీటు కోసం జంపింగ్ జపాంగ్ అంటూ స్థానికులు అంటున్నారు.

# మున్సిపల్స్.. ఎవరి లెక్కలు వారివి..

**కరీంనగర్, జనవరి 30( వెలుతురు):**
తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రభుత్వ పాలనకు రిఫరెండంగానే చూడాలి. ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మున్సిపాలిటీలు, నగరాల్లో కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతుండటంతో అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. అయితే ఎవరికి వారే గెలుపు పై ధీమాగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల తరహా మాత్రం కాదు. ఎందుకంటే పార్టీ సింబల్ మీద జరిగే ఎన్నికలు కావడంతో ఖచ్చితంగా పరిపాలన పై ప్రజా తీర్పు ఎలా ఉందన్నది స్పష్టంగా తెలుస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో గుర్తులుండవు కాబట్టి..ఎవరు గెలిచినా తమ వారిగా వారు చెప్పుకుంటారు. అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ మున్సిపల్ ఎన్నికలపై భారీ ఆశలు పెట్టుకుంది. పట్టణాల్లో పేదలతో పాటు తాము గత రెండేళ్ల నుంచి చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి తమను గట్టెక్కిస్తాయని నమ్ముతుంది. మరొకవైపు మరో మూడేళ్లు అధికారంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఉండటంతో తమ నగరాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ కే ఓటేయడమని ప్రజల ఆలోచన ఉంటుందని హస్తం పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో పాటు క్యాడర్ కూడా గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తుందని, అలాగే పట్టణ ఓటర్లు విజ్ఞతతో ఓటేస్తారని, అందుకే కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు పై ధీమాగా ఉంది. తమ నాయకత్వాన్ని కూడా పకడ్బందీగా రంగంలోకి దించింది. ఇక బీఆర్ఎస్ నాయకత్వం కూడా మున్సిపల్ ఎన్నికల్లో తమను ప్రజలు ఆదరిస్తారని భావిస్తుంది. పట్టణ ఓటర్లు చాలా తెలివిగా వ్యవహరిస్తారని, గత రెండేళ్లుగా ప్రభుత్వం వ్యవరిస్తున్న తీరుతో పాటు అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు ప్రజల్లో పనిచేస్తాయని అంచనా వేస్తుంది. విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో తమకు తిరుగులేని ఆధిపత్యం దొరుకుతుందని భావిస్తుంది. మరొకవైపు పట్టణాల్లో తమకు తొలి నుంచి ఉన్న పట్టు ఖచ్చితంగా విజయావకాశాలను మెరుగు పరుస్తుందని చెబుతున్నారు. అయితే ఎలక్షనీరింగ్ చేయడమే ప్రధానమని, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే అతి పెద్ద టాస్క్ అని కారు పార్టీ నేతలు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. బీజేపీ కూడా ఈ మున్సిపల్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకుంది. బీజేపీకి తొలి నుంచి పల్లెల కంటే పట్టణ ఓటర్ల మద్దతు ఎక్కువగా ఉంది. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంటు నియోజకవర్గాల్లో గెలుపునకు కూడా ప్రధాన కారణం పట్టణ ఓటర్లేనని అంటున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ వెయ్యికి పైగా సర్పంచ్ పదవులను కైవసం చేసుకున్నామని, ఇక పట్టణాల్లో కమలం జోరును ఆపడం ఎవరి తరమూ కాదని ఆ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. కేంద్ర నాయకత్వం కూడా మున్సిపోల్స్ పై దృష్టి పెట్టి రాష్ట్ర నాయకులను అప్రమత్తం చేసింది.

# కమలం గేర్ మార్పు..








**హైదరాబాద్, జనవరి 30( వెలుతురు):**
తెలంగాణ రాజకీయ యవనికపై ప్రత్యామ్నాయం మేమే అని విర్రవీగిన భారతీయ జనతా పార్టీకి, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ఒక గట్టి హెచ్చరికను పంపాయి. ఒకప్పుడు రాష్ట్రంలో నెంబర్ 2 స్థానానికి ఎదిగామని, ఇక అధికారమే తరువాయి అని సంబరపడ్డ కమలదళానికి.. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఇంకా అట్టడుగునే ఉందన్న చేదు నిజం బోధపడింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు జరగబోతున్న మున్సిపల్ ఎన్నికలను బీజేపీ తన ఉనికి చాటుకునేందుకు, పోగొట్టుకున్న ప్రతిష్టను తిరిగి పొందేందుకు ఒక అగ్నిపరీక్షగా భావిస్తోంది. ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ అధిష్టానం ఈసారి వ్యూహాన్ని మార్చింది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర నాయకత్వానికి వదిలేసే కేంద్ర పెద్దలు, ఈసారి నేరుగా రంగంలోకి దిగుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తన కొత్త టీమ్‌తో ఇప్పటికే కసరత్తు ప్రారంభించగా, చాణక్యుడిగా పేరుగాంచిన అమిత్ షా స్వయంగా ప్రచార పర్వంలో పాల్గొంటుండడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో మహబూబ్ నగర్ లేదా ఫిబ్రవరి 8, 9 తేదీల్లో నిర్మల్ పట్టణాల్లో వీళ్ల భారీ బహిరంగ సభలకు ఏర్పాట్లు జరుగుతుండటం.. బీజేపీ ఈ ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేస్తోంది. మున్సిపాలిటీలపై జెండా ఎగురవేస్తే తప్ప, వచ్చే సాధారణ ఎన్నికల్లో గెలుపు సాధ్యం కాదని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు. బీజేపీ వెనుకబాటుకు ప్రధాన కారణం బయటి శత్రువుల కంటే ఇంట్లోని విభేదాలే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో పాత నాయకులకు, కొత్తగా చేరిన వలస నాయకులకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా స్థాయిలో గ్రూపు రాజకీయాలు పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ వంటి జిల్లాల్లో ఇటీవల జరిగిన దాడులు, గొడవలే ఇందుకు నిదర్శనం. అధిష్టానం ఎన్ని ఆదేశాలిచ్చినా, రాష్ట్ర నేతల మధ్య సఖ్యత లేకపోవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలు నిరాశలో ఉన్నారు. ఈ చలనం లేని కేడర్‌లో జోష్ నింపేందుకే అమిత్ షా వంటి అగ్రనేతలను బరిలోకి దింపుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన సీట్లు రాకపోవడం, పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగినా అది విజయతీరాలకు చేర్చకపోవడంతో పార్టీ మేధోమథనంలో పడింది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఈసారి 'అర్బన్ ఓటర్ల'పైనే ఆశలు పెట్టుకుంది. కేంద్ర పథకాల లబ్ధిదారులు, మధ్యతరగతి ప్రజలే తమను గట్టెక్కిస్తారని నమ్ముతోంది. నితిన్ నబీన్ నాయకత్వంలో మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ వంటి నేతలను ఇన్‌ఛార్జులుగా నియమించడం ద్వారా ఇతర రాష్ట్రాల ఎన్నికల వ్యూహాలను ఇక్కడ అమలు చేయబోతున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల మధ్య బీజేపీ తన స్థానాన్ని ఎలా కాపాడుకుంటుందనేది ప్రశ్నార్థకం. కేవలం అగ్రనేతల పర్యటనలతోనే ఓట్లు రాలతాయా? లేక గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి నాయకత్వం ఐక్యంగా ముందుకు సాగుతుందా? అనేది వేచి చూడాలి. బీజేపీకి ఈ మున్సిపల్ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కాదు.. తెలంగాణలో ఆ పార్టీ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపు. అమిత్ షా రాకతో పార్టీలో జోష్ రావచ్చు కానీ, ఆ జోష్ ఓట్ల రూపంలోకి మారాలంటే స్థానిక నేతలు అహంభావాన్ని వీడి ఐక్యంగా పనిచేయాల్సి ఉంటుంది. లేదంటే నెంబర్ 2 కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# మోడీ నోట భజన్ క్లబ్బింగ్..







**ముంబై, జనవరి 30( వెలుతురు):**
ప్రధాని నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత చేపట్టిన కొత్త కార్యక్రమాల్లో మన్‌కీబాత్ ఒకటి. రేడియో ద్వారా మారుమూల ప్రజలకు సైతం ఆయన సందేశాని పంతున్నాడు. ఇక ప్రతీ మన్‌కీబాద్‌తో ఒక కొత్త విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అనేక అంశాలను ఆయన పేర్కొన్నారు. తాజాగా అనంతపూర్ నీటి పొదపును ప్రశంసించారు. ఇదే సమయంలో జెన్ జెడ్ యువత చేస్తున్న 'భజన్ క్లబ్బింగ్'ను ప్రస్తావించారు. దీంతో నెటిజన్లలో ఆసక్తి రేగింది. సంప్రదాయ భజనలు, కీర్తనలు, శ్లోకాలతో నైట్‌లైఫ్‌ను పునర్వ్యవస్థీకరించే ఈ ట్రెండ్, ఆధ్యాత్మికతను క్లబ్ కల్చర్‌తో ముడిపెడుతోంది. ఇది కేవలం ట్రెండ్ కాదు.. మానసిక శాంతికి కొత్త మార్గం. లిక్కర్, స్మోకింగ్ లేని ఈ ఈవెంట్లు లైవ్ కాన్సర్ట్‌ల రూపంలో జరుగుతూ, యువతను ఆకర్షిస్తున్నాయి. పాశ్చాత్య క్లబ్ సంస్కృతిలో డీజేలు, లైటింగ్, డ్యాన్స్ ఫ్లోర్ ఉంటే, ఈ భజన్ క్లబ్బింగ్‌లో భక్తి సంగీతం, మాండలిన్, టేబులా లాంటి సంగీత వాద్యాలు కీలకం. రాత్రి సమయంలో జరిగే ఈ కార్యక్రమాలు యువతకు ఒత్తిడి నివారణగా మారాయి. పోస్ట్?కోవిడ్‌లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరగడంతో ఇది ట్రెండ్ అవుతోంది. సోషల్ మీడియాలో వైరల్ వీడియోలు దీన్ని ప్రపంచవ్యాప్తం చేశాయి. భారతదేశంలో హైదరాబాద్, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ఈ ఈవెంట్లు జనాదరణ పొందుతున్నాయి. ఈ ట్రెండ్ యువతలో మానసిక స్థిరత్వాన్ని పెంచుతోంది. స్టడీల ప్రకారం, భజనలు ఆనంద హార్మోన్లను ఉత్పత్తి చేస్తాయి, ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాగే, సాంకేతికత దూరంగా ఉంచి సామూహిక భక్తిని ప్రోత్సహిస్తోంది. సాంస్కృతికంగా, ఇది భారతీయ విలువలను ఆధునిక యువకులకు అనుకూలంగా చేస్తోంది. పాశ్చాత్య ప్రభావాల మధ్య స్వదేశీ ఆధ్యాత్మికతను పునరుజ్జీవనం చేస్తున్నట్లు కనిపిస్తోంది. మోదీ ప్రస్తావన దీన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. అయితే, వాణిజ్యీకరణతో భక్తి స్పృహ క్షీణించే ప్రమాదం ఉంది. కొన్ని ఈవెంట్లు టికెట్ ధరలు ఎక్కువ చేసి డబ్బు సంపాదనపై దృష్టి పెడుతున్నాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు దీన్ని సమాజకార్యాలతో ముడిపెట్టాలి. భవిష్యత్తులో ఈ ట్రెండ్ గ్లోబల్ స్థాయికి వెళ్లే అవకాశం ఉంది. భారతదేశం యోగా, మెడిటేషన్‌తోపాటు భజన్ క్లబ్బింగ్‌ను 'సాఫ్ట్ పవర్'గా ప్రపంచానికి అందించవచ్చు

# కేంద్ర కేబినెట్‌లో నాగబాబు..?



**విజయవాడ, జనవరి 30( వెలుతురు):**
ఏపీలోశరవేగంగా రాజకీయాలు మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. రాజకీయంగా పట్టు బిగించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కానీ ఆ పార్టీకి ఎంత మాత్రం అవకాశం ఇవ్వకూడదని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అయితే పాలనాపరంగా చంద్రబాబు బిజీగా ఉండగా.. కూటమికి రాజకీయ రక్షణగా పవన్ కళ్యాణ్ ఉంటున్నారు. అందుకే విదేశీ పర్యటనలతో పాటు పెట్టుబడుల అన్వేషణ, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం వంటి అంశాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు చంద్రబాబు. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం తన గ్రామీణ శాఖలతో పాటు రాజకీయపరమైన అంశాలకు పరిమితమవుతున్నారు. ఇటువంటి తరుణంలో పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన కొనసాగుతుండడం అనేక రకాల చర్చ నడుస్తోంది. ఈరోజు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో పాటు రైల్వే శాఖ మంత్రి వైష్ణవును కలుసుకోనున్నారు పవన్. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల ను పూర్తి చేయడం, కూటమిపరంగా రాజకీయ అంశాలపై కీలక చర్చలు జరుపుతారని తెలుస్తోంది. ఈ ఏడాది జూన్లో ఏపీ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతాయి. అయితే ఆ నాలుగు స్థానాలు టిడిపి కూటమికి దక్కుతాయి. గతంలో రెండు సార్లు రాజ్యసభ పదవులకు ఖాళీ ఏర్పడింది. టిడిపి తో పాటు బిజెపి ఆ పదవులను దక్కించుకుంది. జనసేనకు వివిధ సమీకరణలో భాగంగా చాన్స్ లేకుండా పోయింది. జనసేనకు ఇంతవరకు రాజ్యసభ ప్రాతినిధ్యం లేదు. ఈసారి రాజ్యసభ సీటుతో పాటు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న పవన్ కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా తో ఇదే విషయం చర్చిస్తారని తెలుస్తోంది. రాజ్యసభ పదవితో పాటు కేంద్ర మంత్రి పదవి తమ పార్టీకి ఇవ్వాలన్న ప్రతిపాదన పెట్టనున్నట్లు సమాచారం. ఒకవేళ జనసేనకు రాజ్యసభ తో పాటు మంత్రి పదవి వస్తే ఎవరికి ఇస్తారు అన్నది ఇప్పుడు ప్రశ్న. ఇప్పటికే జనసేనకు ఇద్దరు లోక్సభ సభ్యులు ఉన్నారు. మచిలీపట్నం నుండి వల్లభనేని బాలశౌరి ఉన్నారు. కేంద్ర క్యాబినెట్లో జనసేనకు అవకాశం ఇస్తే ఆయన పేరును పరిశీలించే అవకాశం ఉంది. అయితే మెగా బ్రదర్ నాగబాబుకు కేంద్ర రాజకీయాలు అంటే ఇష్టం. రాజ్యసభ ద్వారా పెద్దల సభలో అడుగు పెట్టాలని ఆలోచన ఉండేది. ఆ ఛాన్స్ రాకపోయేసరికి సీఎం చంద్రబాబు గత ఏడాది నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటామని ప్రకటించారు. అయితే ఎమ్మెల్సీ అయ్యారు కానీ ఏడాది అవుతున్న మంత్రి వర్గంలోకి తీసుకోలేదు. అయితే ఇప్పుడు జనసేనకు రాజ్యసభ పదవి ఇచ్చి కేంద్ర క్యాబినెట్లో ఛాన్స్ ఇస్తే నాగబాబుని పంపిస్తారని ప్రచారం నడుస్తోంది. దానిపై కూడా పవన్ కళ్యాణ్ హోం శాఖ మంత్రి అమిత్ షా తో చర్చిస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో చూడాలి

# రేవంత్ శాఖ నే టార్గెట్ చేసిన కోమటిరెడ్డి





**నల్గొండ, జనవరి 30( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాలలో సంచలనాలు అంతకంతకు చోటు చేసుకుంటున్నాయి. ఎప్పుడు ఎటువంటి పరిణామం జరుగుతుందో అర్థం కావడం లేదు. మంత్రుల నుంచి మొదలు పెడితే ప్రతిపక్ష నాయకుల వరకు ప్రతి ఒక్కరు ఏదో ఒక విధమైన కామెంట్లు చేస్తున్నారు. అవి కాస్త సోషల్ మీడియా నుంచి ప్రధాన మీడియా వరకు విపరీతంగా చర్చలో ఉంటున్నాయి. ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై ఓ న్యూస్ ఛానల్ కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనం తెలంగాణ రాజకీయాలనే కాదు ఏకంగా ఏపీ రాజకీయాలను కూడా ప్రభావితం చేసింది. ఈ వ్యవహారంలోకి కొంతమంది మీడియా ప్రతినిధులు ప్రవేశించడంతో మరింత వివాదంగా మారింది. దీనిపై ఏకంగా ముఖ్యమంత్రి స్పందించడం.. ఉప ముఖ్యమంత్రి కలగజేసుకోవడం.. ఆ తర్వాత బొగ్గు టెండర్లను రద్దు చేయడం వంటి పరిణామాలు జరిగాయి ఈ పరిణామాల కంటే ముందు కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు. తన మీద కక్ష తీరకపోతే.. ఇంత విషం పెట్టి చంపాలని ఆవేదనతో మాట్లాడారు. ఆయన మాట్లాడిన మాటలు ఒకరకంగా తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టించాయి. ఇప్పుడు వాటిని మర్చిపోకముందే కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్లో కీలకమైన మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన తెలంగాణ విద్యా వ్యవస్థకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. " నేనే విద్యాశాఖ మంత్రిని అయితే కార్పొరేట్ పాఠశాలలను మూసి వేస్తాను. నారాయణ కాలేజీలో డిగ్రీ చేసిన వారు ఉంటే ప్రభుత్వ కాలేజీలలో పీహెచ్డీ చేసిన వారు ఉంటారు. ఏ ఉద్యోగం రాకుండా లక్షల ఉద్యోగం చేస్తున్నారు. బట్టి పట్టిస్తే వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలి. విద్య అనేది వ్యాపారం కాదు. విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదని" కోమటిరెడ్డి అన్నారు. మంగళవారం నల్గొండలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్న శాఖను ఉద్దేశించి కోమటిరెడ్డి ఆ వ్యాఖ్యలు చేయడంతో సహజంగానే రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది. కోమటిరెడ్డి మాట్లాడిన మాటలను గులాబీ మీడియా విపరీతమైన నెగిటివ్ ప్రచారం చేస్తోంది.. అయితే తాను చేసిన వ్యాఖ్యలను వేరే కోణంలో చూడవద్దని ఇప్పటికే కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పడం గమనార్హం.

# ప్రతి ఇంట్లో కనిపించే కథ.. 'ఓం శాంతి శాంతి శాంతిః'

'ఓం శాంతి శాంతి శాంతిః' మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయహే'కి రీమేక్ ఇది. బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగం చేయాలనీ భవిష్యత్తు గురించి చిన్నప్పట్నుంచీ ఎన్నో కలలు కన్న ఓ సగటు యువతి ప్రశాంతి అలియాస్ శాంతి (ఈషా రెబ్బా). కళాశాలలో జరిగిన ఓ సంఘటనతో చదువును అర్ధాంతరంగా ఆపేసి పెళ్లికి తలూపాల్సి వస్తుంది. కట్టుకున్న అమ్మాయిని తాను చదివిస్తానని మాట ఇచ్చి మరీ శాంతిని పెళ్లి చేసుకుంటాడు చేపల వ్యాపారి ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్). పెళ్లి తర్వాతైనా చదువుకోవచ్చనే సంతోషంతో నాయుడుతో కలిసి ఏడడుగులు వేస్తుంది. కానీ, ఆమె ఊహించింది ఒకటి, పెళ్లి తర్వాత జరిగింది మరొకటి. భర్త అనే అహంకారంతో తన కోపాన్నంతా భార్య శాంతిపై ప్రదర్శిస్తుంటాడు ఓంకార్. ఆయనకు కోపం వచ్చిందంటే భార్య చెంప పగిలిపోవల్సిందే. ఇదే విషయాన్ని కన్నవాళ్లతో చెబితే సర్దుకుపోవాలంటూ చెబుతారు. రోజు రోజుకీ భర్త పెట్టే హింస శ్రుతిమించడంతో ఒక రోజు శాంతి ఎదురు తిరుగుతుంది. తానూ చేయి చేసుకోగలననీ భర్తకు బాగా తెలిసేలా చేస్తుంది. దాంతో కంగుతిన్న ఓంకార్ ఏం చేశాడు? ఆ తర్వాత భార్యాభర్తల మధ్య యుద్ధం ఎలా సాగింది? ఇద్దరూ విడిపోయారా? లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఇంటినీ ఆలోచింపజేసే బలమైన కథ ఇది. ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ తనని తాను చూసుకునే శాంతి పాత్ర ఇందులో ఉంది. ఓంకార్ నాయుడులా అహంకారం, ఆవేశంతో భార్యలపై చేయి చేసుకున్న మగాళ్లూ ఈ సినిమా చూస్తున్నప్పుడు చాలామందే గుర్తుకొస్తారు. గోదావరి నేపథ్యాన్ని జోడించడమే ఈ సినిమాని ప్రత్యేకంగా నిలబెట్టింది. తెలుగుదనం ఉట్టిపడే పాత్రలు, గోదావరి యాస ఈ సినిమాని సొంతం చేసుకునేలా చేస్తాయి. అచ్చమైన గోదావరి ప్రాంతం నేపథ్యాన్ని ఆవిష్కరించే ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. కట్టుబాట్ల పేరుతో అమ్మాయిల స్వేచ్ఛని, వాళ్ల హక్కుల్ని హరించి వేస్తున్నామని చెప్పకనే చెబుతాయి ఆ సన్నివేశాలు. ఓంకార్ నాయుడు పాత్ర పరిచయం తర్వాత సన్నివేశాలు సరదా సరదాగా మారిపోతాయి. బ్రహ్మాజీ నేపథ్యంలోని సన్నివేశాలు మరింత సందడిగా సాగుతాయి. శాంతి పాత్ర మెట్టినింట్లోకి అడుగుపెట్టాక అక్కడ ఆమెకి ఎదురయ్యే పరిణామాలు చాలా ఇళ్లల్లో చోటు చేసుకునే గృహ హింసకు అద్దం పట్టేలా ఉంటాయి. శాంతి ఎదురు తిరగడంతోనే కథ మలుపు తిరుగుతుంది. అక్కడ మొదలైన భార్యాభర్తల మధ్య యుద్ధం ఎక్కడ ముగిసిందన్నదే మిగతా సినిమా. ద్వితీయార్ధం తర్వాత ఆ ఇద్దరి మధ్య సాగే కొన్ని సన్నివేశాలు పునరావృతం అయినట్టుగా అనిపిస్తాయి. ఓంకార్ నాయుడు పాత్రలో తరుణ్ భాస్కర్ ఒదిగిపోయిన తీరు మెప్పిస్తుంది. ఆయన గోదావరి యాస పలికిన విధానం కూడా బాగుంది. భార్య తిరగబడేంత వరకూ ఒకలా కనిపించిన తరుణ్, భార్య చేతిలో తన్నులు తినప్పట్నుంచి ఆయన ప్రదర్శించిన నటన, హావభావాలు మరో స్థాయిలో ఉంటాయి. శాంతి పాత్రలో ఈషా రెబ్బా నటన ఈ సినిమాకి హైలైట్. ప్రథమార్ధంలో కళ్లతోనే భావాలు పలికిస్తూ పాత్రని పండించింది. భర్తని ఎదిరిస్తూ చేసే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటాయి. బ్రహ్మాజీతోపాటు ఇతర నటులు పాత్రల పరిధి మేరకు మంచి అభినయం ప్రదర్శించారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. దర్శకుడు గోదావరి నేపథ్యాన్ని తెరపై చూపిస్తూ కథని చెప్పిన తీరు, నందకిశోర్ సంభాషణలు ఆకట్టుకునేలా ఉంటాయి.




# అమెజాన్‌లోకి వస్తున్న నారీ నారీ నడుమ మురారి'

సంక్రాంతి కానుకగా విడుదలై, విజయం అందుకున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'నారీ నారీ నడుమ మురారి' ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో ఫిబ్రవరి 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీలోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని సదరు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. సంక్రాంతి బరిలోకి చివరిగా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇద్దరమ్మాయిల మధ్య నగిలిపోయే వ్యక్తిగా హీరో శర్వానంద్ , హీరోయిన్లుగా సాక్షి వైద్య, సంయుక్త ఆకట్టుకున్నారు. సీనియర్ నటుడు నరేశ్, సత్య, సునీల్, వెన్నెల కిశోర్ తమ మార్క్ కామెడీతో అలరించారు. వినోదాత్మక కథలపై తనకెంత పట్టుందో దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాతో మరోసారి నిరూపించారు. బీటెక్ చేసి ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్న కుర్రాడు గౌతమ్ (శర్వానంద్). నిత్య (సాక్షి వైద్య)తో ప్రేమలో ఉన్న తను.. ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి పీటలెక్కాలని అనుకుంటాడు. ఈ పెళ్లికి తొలుత నిత్య తండ్రి రామలింగం (సంపత్ రాజ్) అడ్డు చెప్పినా.. తర్వాత అంగీకరిస్తాడు. ఆ పెళ్లి రిజిస్టర్ ఆఫీస్‌లో జరగాలని షరతు పెడతాడు. తప్పని పరిస్థితుల్లో దీనికి గౌతమ్ ఓకే అంటాడు. అలా పెళ్లికి దరఖాస్తు చేసుకున్నాక గౌతమ్‌కు ఓ అనుకోని చిక్కు ఎదురవుతుంది. దానికి, కాలేజీలో ప్రేమించిన దియా (సంయుక్త)కు ఉన్న సంబంధం ఏంటి? అసలు వాళ్లిద్దరూ ఎందుకు విడిపోవాల్సి వచ్చింది? ఈ రెండు ప్రేమకథల వల్ల గౌతమ్ తండ్రి కార్తీక్ (నరేశ్) – పిన్ని పల్లవి (సిరి హనుమంతు)ల దాంపత్య జీవితం విడాకుల దాకా ఎందుకు వెళ్లింది? అన్నది మిగతా కథ.




# జియో హాట్‌స్టార్‌లోకి 6న వస్తున్న రాజాసాబ్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దేవనగర సంస్థానానికి ఒకప్పుడు జమిందారు గంగాదేవి (జరీనా వహాబ్). అంత గొప్ప నేపథ్యమున్నా తన మనవడు రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)తో కలిసి గంగమ్మగా సాధారణ జీవితం గడుపుతుంటుంది. తన నాన్నమ్మ అంటే రాజుకు ప్రాణం. వయసు ప్రభావం కారణంగా మతిమరుపు సమస్యలతో బాధపడుతూ ఉంటుంది గంగమ్మ. తనకు సంబంధించిన చాలా విషయాల్ని మరిచిపోయినా తన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం మరిచిపోదు. తనకు కలలో కనిపిస్తున్న తాతని ఎలాగైనా వెతికి తీసుకురమ్మని రాజాసాబ్‌ని కోరుతుంది. కానీ, కనకరాజే తనకున్న రకరకాల విద్యలతో నాన్నమ్మ, మనవడిని నర్సాపూర్ అడవిలోని రాజమహల్‌కి వచ్చేలా చేస్తాడు. ఒక దశలో ఇద్దరినీ చంపేయాలని కూడా అనుకుంటాడు. మార్మిక విద్యలెన్నో తెలిసిన కనకరాజుని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడు? అసలు కనకరాజు గతమేమిటి?అతని లక్ష్యమేమిటి? రాజాసాబ్ జీవితంలోకి వచ్చిన ముగ్గురమ్మాయిలు భైరవి (మాళవిక మోహనన్), ÷–లబెస్సీ (నిధి అగర్వాల్) అనిత (రిద్ధి కుమార్) ఎవరు? తదితర విషయాలను సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.




## అఫీషియల్.. 'వారణాసి' విడుదల తేదీని ప్రకటించిన రాజమౌళి

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న పాన్–వరల్డ్ మూవీ 'వారణాసి' విడుదల తేదీ ఎట్టకేలకు ఖరారైంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని రాజమౌళి ఎక్స్ వేదికగా అధికారికంగా ప్రకటించాడు. ఈ సినిమాను వరల్డ్ వైడ్‌గా ఏప్రిల్ 07 2027న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు తెలిపాడు. ఉగాది, గుడి పడ్వా వంటి పండుగలతో పాటు అంబేద్కర్ జయంతి, శ్రీరామనవమి వంటి వరుస సెలవులను దృష్టిలో ఉంచుకుని ఈ తేదీని లాక్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకమైన విలన్ పాత్రలో కనిపించనున్నారు. పురాణాల నేపథ్యంతో కూడిన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నాడు. అంతేకాకుండా, భారతీయ సినిమా చరిత్రలోనే తొలిసారిగా ఈ చిత్రాన్ని 1.43:1 ×మీూశ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తుండటం విశేషం. రాజమౌళి మార్క్ ప్రమోషన్లు ఇప్పటి నుంచే మొదలవ్వడంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎన్ని రికార్డులను సృష్టిస్తుందోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.




# రజనీ, కమల్ మల్టీస్టారర్ మూవీ

## జైలర్ డైరెక్టర్ చేతికి ప్రాజెక్ట్ ?

ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది.



అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ ? కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ 'జైలర్ 2'తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది.

# పల్నాడు నేపథ్యంలో భగవంతుడు మూవీ

టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు'. పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది.పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళిధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.



# విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాలు

**- 27మందికి మంత్రి గొట్టిపాటి నియామక పత్రాలు**



**అమరావతి, జనవరి 30( వెలుతురు):**

విద్యుత్ శాఖలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద 27 మంది అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు మంజూరు చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సహా విద్యుత్ శాఖలోని పలు సంస్థల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియామక పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఎప్పటికప్పుడు కారుణ్య నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అర్హత మేరకు ఇంజినీరింగ్ ఉద్యోగాలు ఒక్కరికీ ఇవ్వలేదని విమర్శించారు. ఉన్నత విద్యార్హత ఉన్నవారికి కూడా ఆఫీసు సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అభ్యర్థి అర్హతకు తగిన ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. అర్హులైనవారికి జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లోని పిల్లలకు 600 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చామని.. కారుణ్య నియామకాల్లో జాప్యం లేకుండా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. సీఎస్ కె. విజయానంద్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తూ ఉద్యోగులు ఎవరైనా చనిపోతే కారుణ్య నియామకాలు చేపడుతున్నామని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు అభ్యర్థుల అర్హతకు తగిన ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. ఏడాది లోపు దరఖాస్తు చేసుకోలేకపోయినవారికి కూడా సడలింపులు ఇచ్చి ఉద్యోగాలు కల్పించామని అన్నారు. ఉద్యోగుల భద్రత, యోగక్షేమాలు కల్పించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రమాదాలబారిన పడిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఉద్యోగంలో చేరిన అభ్యర్థులంతా తమ స్కిల్ పెంచుకుంటూ వృత్తిపరమైన అభివృద్ధి సాధించాలని సీఎస్ విజయానంద్ ఆకాంక్షించారు.

# శాఖల వారీగా ఉద్యోగాల ఖాళీల సేకరణ

**- ఉగాది నాటికి జాబ్ క్యాలండర్ ప్రకటించే ఛాన్స్**




**అమరావతి, జనవరి 30( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పనుంది. జాబ్ క్యాలెండర్‌పై కూటమి ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. వివిధ శాఖల వారీగా ఖాళీల వివరాలు సేకరిస్తోంది సర్కార్. పకడ్బందీగా జాబ్ క్యాలెండర్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వంలో ఉన్న వివిధ శాఖల వారీగా భర్తీ చేయ్యాల్సిన ఉద్యోగాల వివరాలను అధికారులు సేకరించే పనిలో ఉన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే గణనీయంగా ఉద్యోగ భర్తీలు చేపట్టిన విషయం తెలిసిందే. మెగా డీఎస్సీ ద్వారా ఇప్పటికే 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేసింది. కేవలం 150 రోజుల్లోనే ఈ పక్రియను పూర్తి చేసి టీచర్ల నియామకాలు విజయవంతంగా పూర్తి చేసింది. అలాగే 6 వేల కానిస్టేబుల్ పోస్టులను కూడా భర్తీ చేసింది కూటమి ప్రభుత్వం. ఇప్పుడు అన్ని శాఖల్లో ఖాళీల జాబితాను సేకరించి ఉద్యోగాల భర్తీ చేపట్టాలని సర్కార్ కసరత్తు ప్రారంభించింది. ఆర్థిక శాఖపై పడే భారం, ఉన్న ఖాళీలు అన్నీ బేరీజు వేసుకుని ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, వీలైనంత త్వరగా ఉద్యోగాల భర్తీ చేపట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నిరుద్యోగ యువతకు భారీ ఊరట కలిగించే అంశం. త్వరలోనే అధికారిక ప్రకటనలు రావాలని నిరుద్యోగులు ఆశిస్తున్నారు.

# ఏఐపై మోడీ మేధోమధనం

**న్యూఢిల్లీ, జనవరి 30( వెలుతురు):**



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తున్న తరుణంలో భారత్ ఈ రంగంలో అగ్రగామిగా ఎదగడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక అడుగులు వేస్తున్నారు. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీల సీఈవోలు, ఏఐ నిపుణులతో ప్రధాని ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరిలో జరగనున్న ఇండియా-ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. భారతదేశం యూపీఐ ద్వారా ప్రపంచానికి తన సాంకేతిక నైపుణ్యాన్ని ఇప్పటికే నిరూపించుకుందని.. ఇప్పుడు ఏఐ రంగంలో కూడా అలాంటి విజయాలు సాధించాలని ప్రధాని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో స్వదేశీ ఎఐ సాంకేతికతను ప్రోత్సహించాలని, టెక్నాలజీలో స్వావలంబన సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్ వద్ద ఉన్న డేటా వైవిధ్యం, ప్రజాస్వామ్య విలువలు ప్రపంచ దేశాలకు మనపై నమ్మకాన్ని కలిగిస్తాయని, అందుకే భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చాలనివిజ్ఞప్తి చేశారు.ఎఐ అభివృద్ధిలో కేవలం వేగం మాత్రమే కాదు.. భద్రత, పారదర్శకత కూడా ముఖ్యమని మోదీ స్పష్టం చేశారు. ఎఐ దుర్వినియోగం కాకుండా దాని వినియోగం పారదర్శకంగా, న్యాయంగా ఉండేలా పటిష్టమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించాలని సూచించారు. యువతలో ఎఐనైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నిపుణులను కోరారు.ఈ సమావేశంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , విప్రో, హెచ్ సీఎల టెక్, జోహో కార్పొరేషన్, జియో ప్లాట్‌ఫామ్స్, అదానీ కనెక్స్ వంటి దిగ్గజ కంపెనీల లతో పాటు.. ఐఐటీ మద్రాస్,ఐఐటీ బాంబే,ఐఐటీ హైదరాబాద్ నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజీవ్ చంద్రశేఖర్ కూడా ఈ చర్చల్లో భాగస్వాములై, ప్రభుత్వ మద్దతును వారికి వివరించారు.

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

**- వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ**

**- అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత**

**న్యూఢిల్లీ, జనవరి 30( వెలుతురు):**



నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.

# దేశ చరిత్రలో నిర్మలా సీతారామన్ ఓ చరిత్ర

**- వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌తో ఆమె రికార్డు**

**- బిజెపి కార్యక్రమంలో ఎంపి పాకా సత్యనారాయాణ**

**విజయవాడ, జనవరి 30( వెలుతురు):**




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం దేశ చరిత్రలో రికార్డు కానుందని బీజేపీ రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఆమె అనుభవాన్ని, ఒకే ప్రభుత్వం పట్ల ప్రజలకున్న నమ్మకాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజల ఆశలకు అనుగుణంగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారని చెప్పుకొచ్చారు. విజయవాడలో బీజేపీ వారధి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాకా సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం బీజేపీ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని వెల్లడించారు. ప్రజల సమస్యలను వివిధ ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లి, వాటికి త్వరితగతిన పరిష్కరించేలా ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ప్రతి శుక్రవారం ఒక ప్రజా ప్రతినిధి ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా నాలుగు ప్రాంతాల్లో ఈ 'వారధి' కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలపారు. ప్రజలు తమకు ఉన్న ఇబ్బందులను, సమస్యలను ఈ వేదిక ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం, ప్రజల మధ్య ఒక 'వారధి'లా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పాకా సత్యనారాయణ పేర్కొన్నారు.ఈ బడ్జెట్‌తో దేశ వృద్ధి రేటు గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని వివరించారు. 2014లో 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, నేడు నాల్గోస్థానానికి చేరుకోవడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదేళ్ల అద్భుత పరిపాలనకు నిదర్శనమని ఉద్ఘాటించారు. 2014లో రూ. 14.30 లక్షల కోట్లుగా ఉన్న బ్జడెట్, నేడు రూ. 50.40 లక్షల కోట్లకు చేరుకుందని చెప్పుకొచ్చారు. కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడమే కాకుండా, ప్రపంచ యుద్దాల ప్రభావం భారత్‌పై పడకుండా ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించిందని తెలిపారు. రష్యా నుంచి చమురు దిగుమతులు, యూరోపియన్ యూనియన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలు భారతదేశ పరపతిని పెంచాయని తెలిపారు. భారత్ ఎదిగితే ప్రపంచం ఎదుగుతుందని యూరోపియన్ యూనియన్ అధ్యక్షులు చెప్పడం విశేషమని పేర్కొన్నారు. ఏపీ ప్రయోజనాల దృష్ట్యా ఈ బడ్జెట్‌లో కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయని తెలిపారు. పోలవరం నిర్మాణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవడంతో పనులు వేగవంతం కానున్నాయని చెప్పుకొచ్చారు.

జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు. అమరావతిని చట్టబద్ధమైన ఏకైక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్యాకేజీలు, నాబార్డ్ వంటి సంస్థల నుంచి ఆర్థిక సహాయం అందనుందని వెల్లడించారు. ప్రపంచ ఆక్వా ఎగుమతుల్లో భారత్ వాటా 76 శాతం కాగా, అందులో 60శాతం కేవలం ఆంధ్రప్రదేశ్ నుంచే జరుగుతోందని వివరించారు. ఈ రంగానికి బ్జడెట్‌లో తగిన ప్రాధాన్యత లభించిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రి నారా లోకేశ్ ప్రయత్నాల వల్ల ప్రపంచ వాణిజ్య సంస్థలకు ఆంధప్రదేశ్‌పై నమ్మకం పెరిగి, భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. మొత్తంగా, ఈ బడ్జెట్ అటు దేశ భద్రతకు, ఇటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు.

# పొత్తుల లెక్కలు తేలెదెలా...

**ఖమ్మం, జనవరి 30( వెలుతురు):**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోగా, ముఖ్యంగా అధికార కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తుల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులకు, ఇప్పటికి సమీకరణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, తన మిత్రపక్షాలైన వామపక్షాలను కలుపుకుపోవడంలో ఎదుర్కొంటున్న సవాళ్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ప్రస్తుతం పొత్తుల చర్చల్లో కొత్తగూడెం మున్సిపాలిటీ అత్యంత కీలకంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గట్టి పట్టున్న సిపిఐ కొత్తగూడెంలో తమ బలాన్ని నిరూపించుకోవాలని చూస్తోంది. మొత్తం 60 డివిజన్లలో తమకు కనీసం 30 స్థానాలు కేటాయించాలని ఆ పార్టీ పట్టుబడుతోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి 17 స్థానాలకు మించి ఇవ్వలేమని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. ఈ 13 స్థానాల తేడా ఇప్పుడు రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టింది. ఒకవేళ కాంగ్రెస్ తన పట్టు సడలించకపోతే, ఒంటరిగా బరిలోకి దిగడమే కాకుండా, తెలుగుదేశం వంటి ఇతర పార్టీలతో కలిసి వెళ్లేందుకు కూడా సిపిఐ సిద్ధమవుతోంది. ఇదే గనుక జరిగితే ఖమ్మం, నల్గొండ, వరంగల్ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ ఓట్లకు గండి పడే ప్రమాదం ఉందనేది విశ్లేషకుల అభిప్రాయం.మరోవైపు సిపిఎం తీరు ఆసక్తికరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న ఈ పార్టీ, మున్సిపల్ ఎన్నికల్లో కొత్త మిత్రులను వెతుక్కునే పనిలో ఉంది. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల సమయంలో కొన్ని చోట్ల బిఆర్ఎస్, సిపిఎం నేతల మధ్య అవగాహన కుదిరినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే ఫార్ములాను అమలు చేసే యోచనలో రెండు పార్టీలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే కాంగ్రెసేతర పార్టీలన్నీ ఏకం కావాలనేది సిపిఎం అంతర్గత వ్యూహంగా కనిపిస్తోంది.ఈ ఎన్నికల ప్రత్యేకత ఏమిటంటే, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన పొత్తు ఉండకపోవచ్చు. స్థానిక బలాబలాలు, నాయకుల మధ్య ఉన్న సాన్నిహిత్యం ఆధారంగా పొత్తులు మారే అవకాశం ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కలిసి పోటీ చేసే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల కాంగ్రెస్‌ను కాదని, రెండు కమ్యూనిస్టు పార్టీలు జతకట్టవచ్చు. నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల్లోని కొన్ని పట్టణాల్లో బిఆర్ఎస్, సిపిఎం మధ్య లోపాయికారీ ఒప్పందాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.వామపక్షాలు విడివిడిగా పోటీ చేస్తే అది పరోక్షంగా అధికార కాంగ్రెస్‌కు చేటు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో కమ్యూనిస్టులకు కేడర్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది. పొత్తులు కుదరకపోతే ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు, మిత్రపక్షాల ఓట్లు కూడా చీలిపోయి ప్రతిపక్ష బిఆర్ఎస్ లేదా బిజెపికి లాభం చేకూరే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ పార్టీకి ఇది కేవలం మున్సిపల్ ఎన్నిక మాత్రమే కాదు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల తీర్పుగా మారుతుంది. అందుకే చిన్న పార్టీలను కూడా కలుపుకుపోవాల్సిన అవసరం ఆ పార్టీకి ఉంది. కానీ, సీట్ల సర్దుబాటులో ఇచ్చిపుచ్చుకునే ధోరణి లేకపోతే పొత్తులు పొడవటం కష్టమే.మొత్తానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు పొత్తుల గందరగోళం మధ్యే మొదలయ్యాయి. కొత్తగూడెం పీటముడి వీడితేనే కాంగ్రెస్-సిపిఐ బంధంపై స్పష్టత వస్తుంది. సిపిఎం ఏ అడుగు వేస్తుందనేది బిఆర్ఎస్ వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. రానున్న రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల ఖరారు, బి-ఫామ్ ల పంపిణీ నాటికి ఈ రాజకీయ గందరగోళానికి ఒక తెర పడే అవకాశం ఉంది.



# కాంగ్రెస్ సెల్ఫ్ గోల్...

**హైదరాబాద్, జనవరి 30( వెలుతురు):**

మున్సిపల్ ఎన్నికల వేళ సిట్ అధికారులు బీఆర్ఎస్ కు సానుభూతి తెచ్చేందుకు నడుంకట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు నోటీసులు ఇచ్చివిచారణకు పిలవడం మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. కాంగ్రెస్ శ్రేణులు ఇదే భయపడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు చోటు చేసుకున్న కీలక పరిణామం మున్సిపల్ ఎన్నికల్లో కారు పార్టీకి కలసి వచ్చేటట్లు కనిపిస్తుంది. అరవై ఐదేళ్ల వయసులో పెద్దాయనను విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం పై కాంగ్రెస్ నేతలే లోలోపల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో చేయాల్సిన పని ఇదా? అంటూ కొందరయితే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు.ఎంత లేదన్నా కేసీఆర్ తెలంగాణ సాధించిన వ్యక్తిగా నేటికీ ప్రజల్లో చెరగని ముద్ర ఉంది. ఆయన అవినీతి, ఆరోపణలు గత రెండేళ్ల నుంచి ఏ మాత్రం నిరూపించలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఏంటన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురవుతుందంటున్నారు. కాళేశ్వరంలో కోట్ల రూపాయలు అవినీతిజరిగిందని ఆరోపణలు చేసి.. కొన్ని నెలల పాటు కమిషన్ తో కాలం గడిపి, తర్వాత నింపాదిగా సీబీఐకి ఇస్తున్నట్లు చెప్పేయడంతోనే అందులో డొల్లతనం బయటపడిందన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. కాళేశ్వరం అవినీతిని తేల్చలేని వాళ్లు ఇక ఫోన్ ట్యాపింగ్ కేసులో సాధించిందేమటన్న ప్రశ్నను బీజేపీ నేతలు కూడా ప్రశ్నిస్తున్నారు.ఒకరకంగా పెద్దాయనను ఇలా విచారణ పేరిట వేధించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టమే కాని, ఎటువంటి ప్రయోజనాలు ఉండవన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. రేపు ఆయన ఇంట్లో విచారణ చేసినా బీఆర్ఎస్ నేతలు చేసే హడావిడితో కొంత సానుభూతి ఆ పార్టీకి వస్తుందని, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇది అవసరమా? అన్న ప్రశ్న కూడా కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల నుంచి వినిపిస్తుంది. బీజేపీ నేతలు చెబుతున్నట్లు ఇందులో సిట్ అధికారుల కానీ, ప్రభుత్వం కానీ సాధించిందేమీ ఉండదని, కాలయాపన కోసమే ఇటువంటి నోటీసులు ఇవ్వడం, పార్టీకి నష్టంకొని తెచ్చుకోవడం ఎందుకని ప్రశనిస్తున్నారు. మొత్తం మీద కేసీఆర్ ను రేపు విచారించినా తేలేది ఏముంటుందో తెలియదు కానీ.. మున్సిపల్ ఎన్నికల్లో దెబ్బ తగలడం ఖాయమన్న వ్యాఖ్యలు గాంధీ భవన్ నుంచే వినిపిస్తుండటం విశేషం.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com